

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు ఆవశ్యం.

# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 231 • పేజీలు : 8 • మంగళవారం 14 మే 2024 • వెల : రూ. 5.00 Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati






# ఓట్ల జాతర




- ఎపిలో ఓటువేసిన ప్రముఖులు..
- ఓటేసిన చంద్రబాబు బాలకృష్ణ
- పులివెందులలో జగన్ దంపతుల ఓటు
- హిందూపురంలో ఓటేసిన బాలకృష్ణ దంపతులు
- ఇడుపులపాయలో షర్మిల దంపతుల ఓటు
- మంగళగిరిలో ఓటేసిన పవన్ కళ్యాణ్




**అమరావతి, మే 13 (ఆంధ్రపత్రిక):** ఎపిలో పలువురు ప్రముఖులు ఉదయమే ఓటు వేశారు. అమరావతిలో చంద్రబాబు సతీమసమేతంగా ఓటేశారు. అలాగే పులివెందులలో జగన్ దంపతులు ఓటేశారు. ఇడుపులపాయలో షర్మిల ఓటేశారు. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు మిగతా 7లో

## సమయం ముగిసిన క్యూలైన్లు




- 6 లోపు క్యూ లైన్లో ఉన్నవారికి అవకాశం
- సాయంత్రం వరకూ రాష్ట్రవ్యాప్తంగా 75 శాతం పోలింగ్ నమోదు
- రాత్రి 10 గంటల దాకా ఓటింగ్‌కు అవకాశం
- పోలింగ్ మొత్తం పూర్తయితే 80 శాతం దాటొచ్చని అంచనా
- ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా

7లో

## పాఠశాలలకు బాంబు బెదింపులు

◆ వెంటనే రంగంలోకి దిగి తనిఖీలు చేసిన పోలీసులు



**లక్నో, మే 13 :** దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అకతాయిల ఆగడాలు రోజు రోజుకు శృతి మించుతున్నాయి. ఎయిర్ పోర్టులు, పాఠశాలలు, ఆసుపత్రులకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆ క్రమంలో ఆ సమయంలో సదరు సంస్థల సిబ్బంది పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా మిగతా 7లో

## సిఎం పదవి నుంచి తొలగించాలనడం అవివేకం

◆ కేజ్రీవాల్‌కు వ్యతిరేక పిటిషన్‌పై సుప్రీం కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,మే 13 :** కేజ్రీవాల్‌ని ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించాలని వేసిన పిటిషన్‌ని సర్వోన్నత న్యాయ స్థానం సోమవారం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీఎం కేజ్రీవాల్‌ని ఈడీ, సీబీఐ అరెస్టు చేసిన విషయం మిగతా 7లో

## లిప్‌స్టిక్‌పై నార్త్ కొరియాలో నిషేధం

మేకప్‌లపైనా అక్కడ ఆంక్షలు



**ప్యోంగ్యాంగ్,మే 13 :** ఉత్తర కొరియాలో కఠిన చట్టాలు అమలులో ఉన్నాయి. ఫ్యాషన్ అంశంలో కూడా వాటిని పాటిస్తున్నారు. కాస్మటిక్స్ యూజర్స్‌కు పెనాల్టీ విధిస్తున్నారు. ఎరుపు రంగు లిప్‌స్టిక్‌పై ఉత్తర కొరియాలో తాజాగా నిషేధం విధించారు. నిజానికి ఎరుపు రంగుకు కమ్యూజినంతో లింకు ఉన్నా.. ఆ రంగు లిప్‌స్టిక్‌ను నార్త్ కొరియా బ్యాన్ చేయడం మిగతా 7లో

## ఈ పోలింగ్ చారిత్రాత్మకం

చంద్రబాబు ఆసక్తికర ట్వీట్



**అమరావతి, మే 13 (ఆంధ్రపత్రిక):** ఏపీలో పోలింగ్ ముగిసిన వేళ టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు ఓ ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. ఈ పోలింగ్ రోజుని రాష్ట్రంలో ఓ మిగతా 7లో

## కాశీ వీధుల్లో మోదీ భారీ రోడ్‌షో

- హాజరైన సిఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు - నేడు వారణాసిలో మోదీ నామినేషన్




**వారణాసి,మే 13 :** ఉత్తర్ ప్రదేశ్‌లోని వారణాసి నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం సాయంత్రం నగరంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షో ప్రారంభించడానికి ముందు లంక ప్రాంతంలోని మాలవ్య చౌరస్తా వద్ద ఉన్న మిగతా 7లో

## వైకాపాపై ఓట్లతో ప్రజల తిరుగుబాటు

- వారికి పాదాభివందనం చేస్తున్నా..

- ఎక్స్ వేదికగా లోకేశ్ స్పందన



**అమరావతి, మే 13 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రప్రజల తెగువకు పాదాభివందనం అంటూ ఎక్స్ వేదికగా నారా లోకేశ్ స్పందించారు. రాష్ట్రంలో ప్రజా తీర్పును తారుమారు మిగతా 7లో

## ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదు

- రాయబరేలి ప్రచారంలో ప్రజల ప్రశ్నలకు రాహుల్ స్పందన..
- బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుంది..
- రాయబరేలి తమకు కర్మభూమి లాంటిది..



**లక్నో,మే 13 :** ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్లమెంట్ మిగతా 7లో

## ఎపి ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు

- తెనాలి,మాచర్ల,అనంతపురం ఘటనలపై ఈసి సీరియస్
- తెనాలి వైకాపా అభ్యర్థి గృహనిర్బంధానికి ఆదేశం..
- పుంగనూరు ఎస్ఐ సస్పెన్షన్‌కు ఆదేశం..
- వైకాపా తీరుపై టిడిపి ఆగ్రహం..ఈసికి ఫిర్యాదు
- 120 ఘటనలు జరిగాయని కనకమేడల వెల్లడి





**అమరావతి, మే 13 (ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు హింసాత్మకంగా మారాయి. పలు చోట్ల వైకాపా శ్రేణులు దాడులుకు దిగాయి. గుంటూరు జిల్లా తెనాలి, పల్నాడు జిల్లా మాచర్ల, అనంతపురంలో జరిగిన సంఘటలను ఎన్నికల సంఘం తీవ్రంగా మిగతా 7లో

## సర్వేలు చెప్పడం మానేశాను



- రాజకీయాల్లో ఉంటే ప్రజల నాడి పట్టేవాడిని..
- మళ్లీ రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనేమీ లేదు
- విజయవాడలో ఓటేసిన లగడపాటి రాజగోపాల్

**విజయవాడ, మే 13 (ఆంధ్రపత్రిక):** ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మాజీ ఎంపీ లగ డపాటి రాజగోపాల్ ఆసక్తికర మిగతా 7లో

## తెలంగాణలో ముగిసిన పోలింగ్..



- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ..
- 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్
- 65శాతం వరకు నమోదయ్యే ఛాన్స్..
- హైదరాబాద్‌లో అతి తక్కువగా పోలింగ్ నమోదు

7లో

## మోదీ మతపర ప్రసంగాలు?




- చర్యలకు ఈసీని ఆదేశించాలంటూ పిటిషన్
- మెరిట్ లేదంటూ తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు
- ఈసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు

**న్యూఢిల్లీ, మే 13 :** లోక్‌సభ ఎన్నికల్లో మతపరమైన విభజన ప్రసంగాలు చేయడం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మిగతా 7లో

ఒరులేయని యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

# ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# ఉగ్గుపాల నుంచే..

"కాకి పిల్ల కాకికి ముద్దు" అన్న చందాన,ఎవరి భాష వారికి ఇష్టమే. మాతృ మూర్తి,మాతృభూమి, మాతృభాషను నిత్యం కొలిచే సంప్రదాయం మన సంస్కృతి లోనే ఉంది.కాల ప్రవాహంలో, జీవనగమనంలో చాలామంది ఈ మూడింటికీ దూరమవుతున్నారు.కాటుక కంటి నీరు చనుకట్టు పయింబడ.. ముగ్గురు అమ్మలూ ఏడ్చే పరిస్థితులే కాన వస్తున్నాయి. తెలుగు భాషా సంస్కృతులు పరాయిభూముల్లోనే పరిఢ విల్లుతున్నాయి. ఉద్యోగ ఉపాధి కోసం విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారు నిత్యం తెలుగుతల్లిని గుండెల్లో నిలుపుకునేలా కార్యక్రమాలు చేపడుతూ ఉండడం అభినందనీయం.ఎంత ఎంత ఎడ మైతే... అంత తీపి కలయిక అన్నట్లుగా,ఏదో ఒక రూపంలో తల్లి భాషకు దగ్గరయ్యే కృషి విదేశాల్లో ఉన్న తెలుగువారు చేస్తున్నారు. కవులను,కళాకారులను ఇక్కడ నుంచీ అక్కడకు పిలుపించుకుని మన పద్యాలు, అవధానాలు, వాగ్గేయకార కీర్తనలు,కూచిపూడి నృత్యాలు, భువన విజయరూప కాలకు పట్టం కడుతున్నారు.కొన్ని దశాబ్దాల నుంచి తల్లిపాలకు, తల్లిభాషకు చాలా వరకూ దూరమవుతున్నాం.మన దేశాన్ని దోచేద్దామని వచ్చిన బ్రౌన్ దొర గుండెను సైతం మన పద్యం దోచేసింది. దొరగారు వేమన్న వెర్రిలో పడిపోయాడు. తమిళవారు మహాకవిగా భావించే సుబ్రహ్మణ్యభారతికి తెలుగువంటి తీయనైన భాష ఇంకొకటి లేనేలేదని అనిపించింది. శ్రీకృష్ణదేవరాయల పితృభాష తుళు.కానీ మాతృభాష తెలు గేనని చరిత్రకారులు చెబుతున్నారు. "దేశ భాషలందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణదేవరాయలు పలికినా, వినుకొండ వల్లభరాయడు చెప్పినా, అవి అక్షర సత్యాలు.దేశ భాషల్లో 'అచ్చు'తో అంతమయ్యే అజంత భాష తెలుగు.తెలుగు మాట్లా డుతూ ఉంటే సంగీత మెదియో వింటున్నట్లు ఉండే అమృత భాష తెలుగు,అని ఎందరెంద రో కీర్తించారు.మిగిలిన భాషలను గౌరవిస్తూనే,మన భాషను పూజించు కోవాలి.అన్ని భాషలు విలసిల్లాలి.అన్ని సంస్కృతులు విరాజిల్లాలి.సర్వమత సహనం వలె,సర్వ భాషల పట్ల ప్రియంగా ఉండమని యునెస్కో చెబుతోంది. ఈ సందర్భంగా, భాషల స్థానాన్ని విశ్లేషించుకుందాం.ప్రపంచంలోనే ఎక్కువమంది మాట్లాడే భాషల్లో నాల్గవ స్థానం హిందీకి,ఆరవ స్థానం బెంగాలీకి,10వ స్థానం లహందీకి (పశ్చిమ పంజాబీ)దక్కాయి. ఈ పదింటిలో మూడు భారతీయ భాషలు ఉండడం విశేషం.ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న భాషల్లో ఇంగ్లీష్‌దే అగ్రపీఠం. మాతృభాషతో పాటు తప్పకుండా నేర్చుకోవాల్సిన భాష ఇంగ్లీష్.వీటికి తోడు అదనంగా నేర్చుకోవడం మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్న భాషల్లో చైనీస్,స్పానిష్,జర్మన్, ఫ్రెంచ్, అరబిక్, రష్యన్, పోర్చుగీస్, జపనీస్,హిందీ,ఇటాలియన్ కొరియా ప్రధాన మైనవి. భారతదేశంలో ఎక్కువమంది మాట్లాడే భాషల్లో హిందీ మొదటి స్థానంలో ఉంది.సుమారు 50కోట్ల మంది ఈ భాషను మాట్లాడేభాషగా ఉపయోగి స్తున్నారు. రెండవ స్థానం బెంగాలీకి, మూడవ స్థానం మరాఠీకి, నాల్గవస్థానం తెలుగుకు ఉన్నాయి. కేవలం జనాభాను దృష్టిలో పెట్టుకొని ఈ క్రమంలో విభజించారు. "జనని సంస్కృతంబు సకల భాషలకు " అంటారు. మన జ్ఞానం మొత్తం ఇందులోనే దాగి వుంది. మనం మాట్లాడే చాలా మాటలు సంస్కృతం నుంచి పుట్టినవే. ఇంతటి సంస్కృత భాషకు మనం దూరమై చాలా కాలమైంది.బ్రిటిష్ వాళ్లు మన విద్యా విధానాన్ని పాడు చేసిన క్రమంలో,సంస్కృతం మనకు దూరమైపోయింది. సంస్కృతాన్ని అభ్యసించడం, పరిరక్షించుకోవడం అత్యంత కీలకం. దేశంలో ఎన్ని భాషలు ఏర్పడినా, సంస్కృతంలో అవలీలగా,అలవోకగా ఒదిగిన భాషల్లో తెలుగుదే అగ్ర తాంబూలం. సంగీత, సాహిత్యాలకు జీవంపోసే రసపుష్టి తెలుగులో ఉన్నంతగా మిగిలిన భాషలకు లేదు.ఉర్దూ కూడా గొప్ప భాష.ఈ భాషలో రాజసం ఉంటుంది. మొన్న మొన్నటి వరకూ సంస్థానాల లో,రాజాస్థానాలలో సంగీత, సాహిత్యాలలో రాజ్యమేలిన భాష ఉర్దూ.ఇది భారతీయమైన భాష.ఇండో–ఆర్యన్ వర్గానికి చెందిన భాషగా దీనికి గుర్తింపు వుంది. ప్రపంచంలో ఎక్కువమంది మాట్లాడే భాషల్లో ఉర్దూ 11వ స్థానంలో ఉంది.భారతీయ భాషలకు దక్కు తున్న ఈ గౌరవాలను చూసి, ఆనందిస్తూనే,మన తల్లిభాష తెలుగు గురించి మరింత ఆలోచించాల్సిన సమయం వచ్చేసింది.అత్యంత ప్రాచీన భాషలలోను మనకు హోదా దక్కింది.దీన్ని సాధించు కోడానికి రాజకీయంగా పెద్ద ఉద్యమమే చేయాల్సి వచ్చింది. మనతోటి దక్షిణాది భాషల్లో కన్నడ లిపికి, మన లిపికి ఎంతో సారూప్యతలు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకూ రెండూ కలిసే ఉన్నాయి.మన కంటే కాస్త ముందుగా తమిళం సొంత పదాలు సృష్టించుకొని, స్వాతంత్ర్యం పొందింది.మన జాను తెనుగు,అచ్చ తెనుగు వికసించినా,సంస్కృత భాషా సంపర్కం మన భాషకు వన్నెలద్దుతూనే ఉంది.విద్యా బోధన లో,ఉద్యోగ,ఉపాధిలో తెలుగును వెనక్కు నెట్టేస్తున్నారన్నది చేదు నిజం. అభివృద్ధి కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా,ఏ భాషలు ఎంత అవసరమైనా, తెలుగును విస్మరించకుండా ముందుకు వెళ్లడం చాలా ముఖ్యం.ఇంగ్లీష్ భాషలో బోధన అవసరమే అయినప్పటికీ, కనీసం 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ తెలుగులో బోధన ఉండడం ముఖ్యం.ఒక సబ్జెక్టుగా తెలుగును తప్పనిసరిగా ఉంచడం కంటే,ఇంగ్లీష్ లేదా తెలుగులో విద్యాభ్యాసం చేసే సదుపాయం ఉంచడం అత్యంత కీలకమని భాషా శాస్త్రవేత్తలు చెబుతున్న మాటలను గౌరవించడం ప్రభుత్వాల బాధ్యత. ఏ భాషలోనైనా చదువుకునే వెసులుబాటు కల్పించడ మే వివేకం.మనో వికాసానికి,మేధో వైభవానికి తల్లిభాష తల్లిపాల వంటిది.అది అందరూ గుర్తించి తీరాలి.పట్టుదల,అవసరం,తెలివి, కృషి ఉంటే ఎన్ని భాషలనైనా, ఎప్పుడైనా నేర్చుకోవచ్చునని మన పూర్వులెందరో చేసి చూపించినవే. వివిధ స్థాయిల్లోని తెలుగు పాఠ్యాంశాలలో పద్యం దూరమవుతోంది. వ్యాకరణం, ఛందస్సు దూరమవుతున్నాయి. ఇది మంచి పరిణామం కాదు. ఆధునిక సాహిత్య ప్రక్రియల కు స్థానం కలిపిస్తూనే, సంప్రదాయమైన పద్యాన్ని సమున్నతంగా గౌరవించేలా పాఠ్యాంశాలు ఉండాలి. పద్యం మన తెలుగువాడి సొత్తు.వ్యాకరణం లేకపోతే, పునాదిలేని భవనంలా భాషలు దెబ్బతింటాయి. నిన్నటి వరకూ మైసూర్ లో ఉన్న తెలుగు కేంద్రం మన నెల్లూరుకు తరలి రావడం మంచి పరిణామమే. ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవడంలోనూ,కేంద్రం నుంచి తెలుగు భాషా వికాసాల కోసం నిధులను తెప్పించుకోవడంలోనూ రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలి. తెలుగు భాష,సాహిత్యం, సంస్కృతిపై అన్ని విశ్వవి ద్యాలయాలలోనూ పరిశోధనలు పెరగాలి. తెలుగు చదువుకున్న వారికి ఉద్యోగ, ఉపాధిల్లో విశిష్ట స్థానం కలిపించాలి. ఈ బాధ్యత ప్రభుత్వాలదే.భాషలు జీవ నదుల వంటివి.అనేక అన్యభాషలను కలుపుకుంటూనే ప్రవహిస్తూ ఉంటాయి.కాకపోతే మురికినీరు చేరకుండా, చేరినా,చెడు జరుగకుండా చూసుకోవడం మన కర్తవ్యం.మాండలీకాలకు ఉండే సొగసు సోయగం వేరు. వాటిని గేలి చేయకుండా,ఆ పరిమళాలను ఆస్వాదిద్దాం.తల్లి తెలుగు భాషను నెత్తిపై పెట్టి పూజించుకుంటూ,ఆ వెలుగులో,ఆ వెలుతురులో రసమయంగా జీవిద్దాం. పిల్లలకు ఉగ్గుపాల దశ నుంచే తల్లిభాషపై మమకారం పెంచడం పెద్దల బాధ్యత.

# క్రమశిక్షణ, కర్తవ్య దీక్ష
# రెండు కళ్ళయిన కృష్ణమోహనరావు



పుట్టుకతోనే క్రమశిక్షణ అలవర్చుకున్నారు. వయసుతో పాటు దేశ భక్తి భావాలను పెంపొందించుకున్నారు. సామాజిక సేవ వైపు దృష్టి సారించారు. ఉద్యోగం రుచించక రాజీనామా చేశారు. ఉద్యమాల్లో పాల్గొన్నారు. వెదుక్కుంటూ వచ్చిన పదవులకు న్యాయం చేశారు. భూమి శిస్తు, సత్యాగ్రహం, విశాఖ ఉక్కు ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమం, మల్లవరం సత్యాగ్రహం లాంటి వాటిలో ఉద్యమించారు. అత్యవసర పరిస్థితిలో అరెస్టయ్యారు. 19 మాసాలు జైలు జీవితం గడిపారు. గుండెను దిటవు పరుచుకున్నారు. జై ఆంధ్ర ఉద్యమంలో అరెస్టు కాబడి జైలు జీవితం గడిపారు. అప్పులకు దూరంగా ఉన్న కాలంలో శ్రీమతిని, సంతానాన్ని ఊరడించటం కోసం కారాగారం నుంచే ఉత్తరాలు రాసేవారు. వారికి ధైర్యం కలిగించే వారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే సదుద్దేశ్యంతో విద్యా సంస్థలు స్థాపించారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కారాగారంలో గడిపిన కాలంలోనే ఆధ్యాత్మికత వైపు దృష్టి సారించారు. పురాణేతిహాసాలతో పాటు అనేక చారిత్రక గ్రంథాలను పరిశీలించి, పఠించి వాటిలోని ఔన్నత్యాన్ని ఆకళింపు చేసుకున్నారు. రాజకీయాల వైపు దృష్టి సారించారు. శాసనసభ్యులు కాలేక పోయారు. ఆయనే కొమరగిరి కృష్ణమోహనరావు.కొమరగిరి కృష్ణమోహనరావు 1936 మే 1వ తేదీన జన్మించారు. విశాలాక్షి, నరసింహారావులు వీరి తల్లిదండ్రులు. కృష్ణాజిల్లా నందిగామకు సమీపంలోని 'గుమ్మడిదుర్రు' వీరి స్వగ్రామం. అక్కడికి సమీపంలోని అడవిరావులపాడులో కృష్ణమోహనరావు జన్మించారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణగా మెలిగేవారు. దేశభక్తి భావాలను పెంపొందించుకొని 1954లో 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్'లో చేరారు. మూడేళ్ళు ప్రచారక్‌గా పని చేశారు. అలా ప్రచారక్‌గా కొనసాగుతున్న రోజుల్లోనే జయప్రదతో వివాహం జరిగింది. జీవిత భాగస్వామి రాకతో కృష్ణమోహనరావుకు ఉద్యోగం కూడా సంప్రాప్తించింది. నాగార్జునసాగర్ ఆనకట్టు నిర్మాణంలో ఉద్యోగిగా చేరి మూడున్నర ఏళ్ళు కొనసాగారు. తన ఆశయాలకు ఆ ఉద్యోగం అనువైంది కాదని అభిప్రాయపడ్డారు. రాజీనామా చేశారు. తన శక్తి సమాజానికి ఉపయోగపడాలని అభిప్రాయపడ్డారు. మళ్ళీ 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్'లో చేరారు. అందులో కొనసాగుతూనే 1969లో నందిగామలో 'వివేకానంద విద్యానికేతన్' స్థాపించారు. అప్పటికి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలే గాని ప్రయివేటు పాఠశాలలు లేవు. క్రమశిక్షణ విషయంలోనూ, విద్యా ప్రమాణాల విషయంలోనూ ప్రభుత్వ పాఠశాలలు మైనస్ పాయింట్లతోనే కొనసాగుతూండేవి. ఆ మైనస్ పాయింట్లను ప్లస్ పాయింట్లుగా చేయాలనే సత్సంకల్పంతో కృష్ణమోహనరావు వివేకానంద విద్యానికేతన్ స్థాపించటంతో విజ్ఞులు వారి ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు. కొంతకాలం తర్వాత పశ్చిమ కృష్ణా నుంచి తూర్పు కృష్ణాకు దృష్టి మళ్ళించారు. ఈ సారి ఏకంగా జిల్లా ముఖ్య పట్టణమైన మచిలీపట్నంలోనే "బాలాజీ విద్యాలయం" ప్రారంభించారు. విద్యాలయాలు ప్రారంభించినంత మాత్రాన తన వ్యాపకాలను కుదించుకోలేదు. రెండవసారి 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్'లో చేరినప్పుడు సుమారు నాలుగేళ్ళు కృష్ణాజిల్లాలో ప్రచారక్‌గా కొనసాగారు. ఆ కాలంలోనే "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" ఉద్యమం ఉధృతమైంది. ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అటు తర్వాత "జై ఆంధ్ర" ఉద్యమంలో కూడా కృష్ణమోహనరావు పలు ప్రాంతాల్లో ముందుండి ఉద్యమం నడిపించారు. 1975 నాటి 'అత్యవసర పరిస్థితి' సందర్భంగా దేశంలో లక్షలాది మంది నేతలు అరెస్టయ్యారు. అలా అరెస్టయిన వారిలో కృష్ణమోహనరావు కూడా ఒకరు. 1975 జూన్ 25న ఆయన్ని అరెస్టు చేసి రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు. 19 నెలలు ఆ జైలులోనే గడిపారు. 1977 జనవరి 21న విడుదలయ్యారు. జైలు జీవితంలో పుస్తక పఠనం ఆయనకు ప్రధాన వ్యాపకం. జీవితంలో స్థిరంగా నిలబడే ఆత్మవిశ్వాసం ఆ పుస్తక పఠనం వల్ల తనకు లభించిందని కృష్ణమోహనరావు 1979లో ఈ వ్యాసకర్తకు స్వయంగా వివరించారు. కారాగారంలో ఉన్న రోజుల్లో భార్యకు ఆయన రాసిన లేఖలు 2001లో పుస్తకంగా ముద్రితమై పాఠకుల అభిమానాన్ని చూరగొంది. ఇంతకు ముందు కూడా ఒకసారి అరెస్టయి, రెండు నెలలు జైలు జీవితం గడిపిన సంఘటన ఉంది. జై ఆంధ్ర ఉద్యమంలో పాల్గొన్న కృష్ణమోహనరావును అరెస్టు చేసి రెండు నెలల తర్వాత విడుదల చేశారు. ప్రజా ద్యమాలలో అహర్నిశం శ్రమిస్తున్న కృష్ణమోహనరావు ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనాల్సి వచ్చింది. 1976 తర్వాత దేశ రాజకీయాల్లో ఊహించని మార్పు సంభవించింది. జనతా పార్టీ ఏర్పాటయింది. 1977లో జనతా పార్టీ కేంద్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకుంది. 1978 శాసనసభ ఎన్నికలు అనివార్యమయ్యాయి. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెసు (ఐ) అభ్యర్థి బొద్దులూరి రామారావుపై సుమారు 8 వేల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. సమాజసేవ కార్యక్రమాలతో పాటు సాహిత్య సేవ కూడా కొనసాగించాలనే అభిలాషతో "శ్రీవాణి" పేరుతో మాసపత్రిక ను ప్రారంభించారు. 'బాల విజ్ఞాన కోశము', 'వివేకవాణి', 'రామా యణ పాత్రలు', 'ప్రేమజ్యోతి', 'శ్రీ సత్యసాయి శతకం', 'సాయి లీలా తరంగిణి', 'సాయి చమత్కార వాణి' లాంటి పుస్తకాలను కూడా కృష్ణమోహనరావు ప్రజలకు అందించారు. ఆంధ్రప్రదేశ్ ట్యుటోరి యల్స్ అండ్ కాన్వెంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వత సమితి ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర లోక్ సత్తా సారధ్య సంఘం కన్వీనరుగా సేవలందించిన కృష్ణమోహనరావు 1985 తర్వాత పుట్టపర్తి సత్య సాయి బాబా భక్తునిగా మారారు. కృష్ణమోహనరావు ఆర్థిక ఇబ్బందులు గ్రహించిన సత్యసాయి బాబా వీరికి ఒక బ్లాంక్ చెక్ కూడా పంపటం గమనార్హం. 2009 ఆగస్టు 12న కృష్ణమోహన రావు స్వర్గస్తులయ్యారు.

- దాసరి ఆళ్వారస్వామి

## తెలంగాణ ప్రజలను
# భయాందోళనలకు గురి చేసిన స్కై లాబ్



స్కై లాబ్.. ఈ పేరు నేటి తరానికి అంతగా తెలియక పోవచ్చు. దాదాపు అర్ధ శతాబ్ది క్రితం జనజీవనాన్ని అతలాకుతలం చేసిన సంఘటన. ప్రధానంగా తెలంగాణ అదీ ఉత్తర తెలంగాణ ప్రజలను తీవ్ర భయ భ్రాంతులకు గురిచేసిన నేపథ్యం. యాభై ఏళ్ల పైబడిన వారిని కదిలిస్తే ఈనాటికీ వెంటనే గుర్తుకు వచ్చి, ఆనాటి తీవ్ర భయాందోళనల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించే అరుదైన సంఘటనల అపురూప అపూర్వ దృశ్యం.అంతరిక్షంలో మానవులచే నిర్మించిన పరిశోధనా ఉపగ్రహం లాంటి పరికరాల నిర్మిత అతిపెద్ద కేంద్రాన్ని స్కైలాబ్ అంటారు. భూమి గురుత్వాకర్షణ శక్తిని ఛేదించి మొదటి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్–1ని 1957–అక్టోబర్‌లో అప్పటి సోవియట్ యూనియన్ పంపించడంతో అంతరిక్ష పరిశోధనలు వేగం పుంజుకున్నాయి. ఆ తర్వాత అంతరిక్షం లోనే మానవుడు పరిశోధనా కేంద్రాన్ని (స్కైలాబ్) స్థాపించి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, దానిలోనే ఉంటూ పరిశోధనలు చేస్తూ సౌరకుటుంబాన్ని గురించి ఎన్నో కొత్త విషయాలను తెలుసు కోవడానికి ఈ విజ్ఞానం ఉపయోగించు కున్నాడు. ఈ కేంద్రాన్ని అమెరికా, రష్యా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు అంతరిక్షంలో పరిశోధనలు చేయడానికి నిర్మించాయి. ఈ అంతరిక్ష కేంద్రం భూమి పరిభ్రమించే లోపలి కక్ష్యతో నిర్మించబడింది. ఈ అంతరిక్ష కేంద్రం భూమికి 278 నుండి 460 కి. మీ. ఎత్తులో ఉండి, సరాసరి గంటకు 27, 743 కి. మీ. వేగంతో పరిభ్రమిస్తూ ఉండేది. ఇది రోజుకు 16 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేసేది. ఈ కేంద్రంలో వ్యోమగాములు ఉంటూ, భూగోళ వాతావరణ అధ్యయనానికి, సమాచార ప్రసార సాధనంగా స్కై లాబ్ ను వినియోగించు కున్నారు. స్కైలాబ్ మొదటి యునైటెడ్ స్టేట్స్ అంతరిక్ష కేంద్రం, నాసా ప్రారంభించింది. మే 14 1973, ఫిబ్రవరి 1974 మధ్య 24 వారాలపాటు క్రియాశీలంగా ఉంది. ఇది అంతరిక్ష పరిశోధక నౌక. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దీన్ని రూపొందించింది. కక్ష్యలోకి ప్రవేశపెట్టిన దీని జీవిత కాలం ఏడేళ్లు. అయితే అంతరిక్షం లోకి పంపిన తర్వాత దీన్ని భూమి మీదకు తిరిగి సురక్షితంగా ఎలా తీసుకు రావాలన్న విషయంలో నాసా సరిగా వ్యవహరించలేదు. అయితే ల్యాబ్ గతి తప్పడం మొదలైంది. ఉపగ్రహా జీవిత కాలం ప్రణాళిక ప్రకారం 1974 లో స్కైల్యాబ్ జీవిత కాలం ముగిసిన తరువాత 8 –10 ఏళ్ళ వరకు కక్ష్యలోనే ఉండాల్సి ఉండగా, సౌర కార్యకలాపాలు ఎక్కువ కావడంతో ఉచ్ఛస్థాయిల్లో వాతావరణం పలుచబడి జీవిత కాలం సమయానికంటే ముందే స్కైల్యాబ్ భూ వాతావరణంలోకి ప్రవేశించింది.1978 చివరలో స్కైలాబ్ నియంత్రణ కోల్పోయి గతి తప్పడం గుర్తించారు. చివరకు అది వేగంగా వచ్చి భూమిని ఢీకొనడం తప్ప వేరే మార్గం లేదని అంతా భావించారు. అదే విషయాన్ని నాటి ప్రధాన ప్రసార మాధ్యమం అయిన రేడియోల ద్వారా పదే పదే ప్రకటింప చేశారు. ఫలితంగా ప్రజలు విపరీత భయాందోళనలకు గురయ్యారు. ఇంకా భారత భూభాగంలోనే ఢీ కొంటుందన్న ప్రచారం ఊపందుకుంది. అదే సమయంలో తెలంగాణ ప్రాంతంలో.. నిజామాబాద్ ఎక్కడైనా పడే అవకాశం ఉందంటూ పత్రికల్లో వెలువడ్డ వార్తలు మరింత ఆందోళనకు దారితీసింది. నాడు ఊరూరికీ పత్రికలు రాకున్నా, ఈ వార్తలు దావనంలా వ్యాపించాయి. నాటి ప్రధాన ప్రసార సాధనమైన రేడియో ఉన్న ఇళ్ళ వద్ద జనం గుమి కూడడం, భయాందోళనలకు లోనవడం సర్వ సాధారణంగా మారింది. తెలంగాణ మొత్తం స్కైలాబ్ బారిన పడుతుందన్న శరవేగ ప్రచారం చదువుకున్న, చదువులేని వారు అన్న తేడా లేకుండా తీవ్ర ఆందోళనలో ముంచెత్తి వేసింది. 1979లో జరిగిన ఈ సంఘటన మూడు వారాల పాటు ప్రతి ఆవాస ప్రాంతంలో ఆబాల గోపాలాన్ని కంటికి కునుకు లేకుండా చేసింది. స్కైలాబ్ వలన భూమికి భారీ నష్టం కలుగుతుందని శాస్త్రవేత్తలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. భూమి పై పడితే మహా ప్రళయం సంభవించినట్టేనని భావించిన అనేక మంది ప్రజలు చాలామంది తమ జీవితాలకు అవే చివరి రోజులని భావించి ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకుని కాలం వెళ్ళ దీశారు. ఆకాశం నుంచి నక్షత్రం లాంటిది భూమిని ఢీకొనబోతోందని, దీంతో ప్రళయం వస్తుందని, మనుషులంతా చనిపోతారన్న ప్రచారం నానాటికీ అధికం అయింది. అయితే అంతరిక్షంలో 24 వారాల పాటు పనిచేసిన తరువాత, కక్ష్య క్షీణించి భూవాతావరణంలోకి ప్రవేశించి స్కై లాబ్ విచ్ఛిన్నమై పోయింది. అంతరిక్ష ముగ్గురు వ్యోమగాముల బృందం స్కైల్యాబ్ భూమిపై పడి నాశనమయ్యే లోపు తమకున్న పరిజ్ఞానంతో 1974 ఫిబ్రవరి 8న భూమికి తిగి వచ్చేశారు. 1979 జూలై 11 న స్కైల్యాబ్ భూవాతావరణంలోకి ప్రవేశించి విచ్ఛిన్నమై పోయింది. స్కైలాబ్ కక్ష్య క్షీణించి, జూలై 11, 1979న హిందూ మహాసముద్రం మీదుగా వాతావరణంలో కాలిపోయింది. దాని శకలాలు హిందూ మహా సముద్రంలోను, పశ్చిమా ఆస్ట్రేలియాలోనూ పడ్డాయి.ఇదిలా ఉంటే స్కై లాబ్ భూమిని ఢీకొని భారీ ప్రాణ, ఆస్తి తదితర నష్టం కలిగించగలదనే ఉధృత ప్రచార నేపథ్యంలో.. నాటి అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి. మర్రి చెన్నారెడ్డి. 1979 జూలై 11న ప్రము ఖ పుణ్యక్షేత్రం అయిన ధర్మపురిలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవ స్థానంలో స్థానికుల సమక్షంలో, వేద పండితులతో కూడి భగవ దారాధనలో గడపడం, ఆ తర్వాత హైదరాబాద్‌కు తిరిగి వెళ్ళడం విశేషం.

- రామ కిష్టయ్య సంగన భట్ల...

# శివోహం అంటే అర్థం



మనం మానవులం.. ఎన్నో కర్మలు చేస్తాం. ఇలాంటి మనం శివుడు ఎలా అవుతాం? శివోహం అని ఎందుకు అంటున్నాం? మనం శివుడిగా మారాలి అంటే మనం తెలుసు కోవలసినది ఏమిటి? ఆది శంకరాచార్యుల వారి సాహిత్యమును స్తోత్ర (భక్తి) సాహిత్యము, వైరాగ్య ప్రకరణములు అని రెండుగా విభజించవచ్చు. ఆది శంకరాచార్య విరచిత నిర్వాణషట్కం వైరాగ్య ప్రకరణముల కోవలోనిది. నిర్వాణషట్కం భారతీయ వేదాంత మార్గంలో ఉన్నతమైన రచన. నిజానికి ఎంతో దీర్ఘమైన వ్యాఖ్యానము, వివరణ అవసరము. కాని, ఇక్కడ క్లుప్తముగా మాత్రమే చర్చ ప్రస్తుతానికి! ఆధునిక పోటీ పరీక్షలలో సమాధానం సరిగా తెలియనప్పుడు, సరైనవి కాని సమాధానములను వరుసగా ఇది కాదు, ఇది కాదు అని.. చివరికి సరి ఐన లేదా సరి ఐనట్లు అనిపించిన సమాధానము ను చేరుకొనే పద్ధతి ఒకటి ఉంది. భగవంతుని రూపమును, తత్త్వమును తెలిసికొనడం అసాధ్యం కనుక, ఏది భగవంతుడో తెలియనప్పుడు, ఏది భగవంతుని తత్త్వమో తెలియనప్పుడు ఏది భగవంతుని తత్త్వము కాదో తెలిసికొనడం తేలిక కనుక 'ఇది కాదు' 'ఇది కాదు'అని తీసి వేస్తూ చివరికి మిగిలిన వర్ణనకు, వ్యాఖ్యానమునకూ అందని తత్త్వమేదో అదే పరమాత్మ తత్త్వము అని తెలిసికొనడాన్ని వేదాంతం.నేతి... నేతి" అంటే, 'న ఇతి', 'న ఇతి', అంటే, 'ఇది కాదు' 'ఇది కాదు'.. అని చెప్పింది!

'మనో బుద్ధ్యహంకార చిత్తాని నాహం' మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే నాలుగువిధములైన అంతఃకరణ ప్రవృత్తులు వున్నాయి. మనసు అన్నింటికీ అధిపతి. లేని దాన్ని ఉన్నట్లుగా, తనది కాని దాన్ని తనదే అన్నట్లుగా, క్షణికమైన దానిని శాశ్వతమన్నట్లుగా మరులు గొల్పుతుంది, వుసి గొల్పుతుంది, పురి కొల్పుతుంది, భ్రమింప జేస్తుంది, మరిపిస్తుంది, మురిపిస్తుంది. ఆకాశానికెత్తేస్తుంది. కడకు పాతాళానికి తొక్కేస్తుంది.మనిషికి మనస్సే అన్నింటికి మూల కారణం, ప్రేరణ, ఉత్ప్రేరకం, వినాశక రం. నాది, నాది కాదు – అనేదే బంధానికి, మోక్షానికి కారణాలు. నాది అనేది, నాకు మాత్రమే అనే విచిత్ర బంధం. ఇతరులగురించి ఆలోచింపజేయదు. ఎవరికి చెందకూడదు అంటుంది. పూర్తి స్వార్థం. ఇది వినాశనానికి దారితీస్తుంది.నేను అనేది సాత్వికం. నేను కూడా అనేది రాజసిక అహంకారం. నేను మాత్రమే అనేది తామశిక అహంకారం. నేను ఏమిటి, ఎవరు, ఎందుకు, ఎక్కడ నుండి ఎక్కడికి అనే అన్వేషణ సాత్వికం. మనిషిని ఉన్నతస్థితికి చేర్చుతుంది. నేను కూడా అనేది రాజసికమైనది. నాకు ఒక ఉనికి, నాకు శక్తి ఉంది అని సాధనకు ఉపయోగిస్తుంది. ఈ రెండూ మంచివే, అవసరమే. నేను మాత్రమే, నాకు మాత్రమే అనే తామసిక ప్రవృత్తి కల్గిన వారికి, వారిని వారి ద్వారా నే సర్వ నాశనం చేస్తుంది. దీనికంతా మనస్సే కారణం. కనుకనే మనస్సును బుద్ధికి స్వాధీనం చేసి, బుద్ధి ద్వారా కల్గిన విచక్షణ తో మంచి చెడులు తెలుసుకొని, మంచిని గ్రహించి, చెడును పారద్రోలాలి. కనుక బుద్ధి పరమాత్మతత్వం. బుద్ధికి మనస్సును అప్పచెప్పి జీవిత ప్రయాణం చేస్తే, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు దారి తప్పవు. మంచి కర్మలు మిగులుతాయి. అప్పుడు మానవుడు శివుడవుతాడు.

సేనాధిపత్యం రమేష్

# ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు

**నియోజకవర్గంలో 80 శాతం పోలింగ్**

**చదురుమదురు ఘటనతప్పా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు**

**ఎ.కొండూరు మే 13 (ఆంధ్రపత్రిక) ;** తిరువూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు తప్పా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. తిరువూరు నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల7వేల 190 మంది ఓటర్లు ఉన్నారని, అందులోపురుష ఓటర్లు ఒక లక్షా 1వెయ్యి 994, మహిళా ఓటర్లు 1లక్షా 5వేల 190 ఉన్నట్లు ఆర్డీవో కె.మాధవి తెలిపారు. తిరువూరు మండలంలో 62,708 మంది ఓటర్లు ఉండగా పురుషులు 30,571, మహిళలు 32,133, మంది ఉన్నారని, గంపలగూడెం మండలంలో 58,549 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 28,8501, మహిళలు 29,668, మంది ఉన్నారని, ఎ.కొండూరు మండలంలో39వేల132 మంది ఓటర్లు ఉండగా పురుషులు 19,526, మహిళలు19,606మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.విస్సన్నపేట మండలంలో మొత్తం ఓటర్లు 46,801 మంది ఉండగా, పురుషులు 23,016, మహిళలు 23, 783మంది ఓటర్లు ఉన్నట్లు ఆర్వో మాధవి తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ బూతులు 294 ఉన్నట్లు, పోలింగ్ 80 శాతం జరిగినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 11 మంది పోటీ దారిలో ఉన్నారని, అందులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నల్లగట్ల స్వామి దాసు, ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాసరావు హలో మధ్య గట్టి పోటీ ఉంటుంది.



## ఇరుపార్టీల నాయకులు కార్యకర్తల

# మధ్య వాగ్వివాదం

**ఆందోళన చేస్తున్న వైసీపీ కార్యకర్తలు**

**కంభంపాడు పోలింగ్ కేంద్రానికి చిన్ని రాకతో**

**వైసిపి నాయకుల ఆందోళన**

**కంభంపాడులో ఉద్రిక్తత**

**గొడవను సద్దుమణికించిన పోలీసులు**

**ఊపిరి పీల్చుకొన్న అధికారులు**





**ఎ.కొండూరు మే 13 (ఆంధ్రపత్రిక) :** ఎ.కొండూరు మండలం కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సోమవారం విజయవాడ టిడిపి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించడానికి వెళ్లగా ఒక్కసారిగా వైసిపి నాయకులు, కార్యకర్తలు జై జగన్ జై నాని అంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. చిన్ని తన అనుచరులతో పోలింగ్ కేంద్రానికి ఎందుకు వెళ్లారని, పోలీసులను ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిశీలనటంతో పోలీసులు అప్రమత్తమై ఆందోళన కారులను చెదరగొట్టి గొడవను సద్దుమణిగించారు. ఒక దశలో పోలీసులకు కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. చిన్ని చేసేది ఏమీ లేక తన అనుచరులతో కలిసి తిరువూరు వైపు వెళ్లిపోయారు. గొడవ సద్దుమణగటంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటు హాక్కును వినియోగించుకున్న ప్రముఖులు



**ఎ.కొండూరు మే 13 (ఆంధ్రపత్రిక) :** రాష్ట్రవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు మే 13న జరుగుతున్న నేపథ్యంలో సోమవారం తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణనిధి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామి దాస్, ఎన్డీఏ కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు ఆయా వార్డులో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి స్థానికులే కాకుండా వేరే ప్రాంతాలు వేరే రాష్ట్రాల్లో స్థిరపడిన వ్యక్తులు తమ ఓటు హక్కును వినియోగించుకోవటానికి ఎంత ఉత్సాహంగా ఆనందంగా తమ సొంత గ్రామాలకు ముందుగానే చేరుకొని ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన ఓటర్లందరికి అధికారులకు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

## చిన్ని కార్లను వెంబడించి
# రాళ్లు రువ్వుతున్న అల్లరిమూక

**కంభంపాడులో వైసీపీ నాయకులు,కార్యకర్తలు అరాచకం**



**ఎ.కొండూరు మే 13 (ఆంధ్రపత్రిక) ;** మండలంలోని కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడానికి వచ్చిన ఎన్డీఏ కూటమి టిడిపి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) కార్లపై అల్లరి మూక రాళ్లురువ్వి శాంతిభద్రతలకు విఘాదం కలిగించారు. జగన్, కేశినేని శ్రీనివాస్ (నాని ) జై అంటూ నినాదాలు చేస్తూ, చిన్ని, అనీయాలను అసభ్య పదజాలంతో దూషించి వెంబడించారు. పరిస్థితి విషమించటంతో, చిన్ని అతని అనుయాయులు తిరువూరు వెళ్ళిపోయారు. ఓటు హక్కు వినియోగించుకోవటానికి వచ్చిన ఓటర్లు భయభ్రాంతులకు గురయ్యారు. అధికారులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తించారు. వైసీపీ నాయకులు అనవసరంగా గొడవ పెట్టుకుని, అల్లరి సృష్టించారని, ప్రశాంత వాతావరణంలో జరిగే ఎన్నికలకు రణరంగం చేశారని, దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి గొడవను సద్దుమణిగించడంతో పోలీసులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వైసిపి నాయకుల కార్యకర్తల అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, శాంతిభద్రతను పూర్తిగా క్షీణించాయని, గొడవ సృష్టించిన అల్లరి మూకపై పోలీసులు చర్యలు తీసుకోవాలని తిరువూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు పోలీస్ ఉన్నతాధికారులను కోరారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న
# మహిళా ఓటర్లు మొరాయించిన ఈవీఎంలు

**పడిగాపులు పడుతున్న ఓటర్లు**



**ఎ.కొండూరు మే 13 (ఆంధ్రపత్రిక) ;** ఎ.కొండూరు మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చీమలపాడు, కోదూరు, మారేపల్లి గ్రామాల్లో ఈవీఎంలు సాంకేతిక లోపం కారణంగా మొరాయించటంతో గంటల తరబడి పోలింగ్ నిలిచిపోయింది. దీంతో ఒకపక్క, ఎండ వేడిమి, మరోపక్క ఉక్క పూతతో ఓటర్లు అల్లాడిపోయారు. అధికారులు పనికిరాని ఈవీఎంలు పంపించి ఓటర్ల సహనాన్ని పరీక్షించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు మెకానికులు ఈవీఎంలు రిపేరు చేయడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. దీంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# భారీ మెజారిటీతో గెలుస్తా

**- సుజనా చౌదరి**



**విజయవాడ, మే 13, (ఆంధ్రపత్రిక) :** శాసనసభ ఎన్నికల్లో తన గెలుపు తథ్యమని పశ్చిమ నియోజకవర్గ కూటమి బిజెపి అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుం టున్నారని ఐదేళ్ల వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలందరూ సిద్ధమయ్యారన్నారు. ఈ ఎన్నికల్లోఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పశ్చిమ నియోజకవర్గం ఎన్డీయే కూటమి అభ్యర్థి సుజనా చౌదరి పరిశీలించారు. భవానీపురంలోని రవీంద్రభారతి, సర్ ఆర్థర్ కాటన్ నేతాజీ స్కూల్, తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సరళిని గమనించారు. మహిళలు,వృద్ధుల,తాగునీటి సౌకర్యాల గురించి ఆరా తీశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల అధికారులు ఓటర్ల కోసం టెంట్లను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలని సుజనా విజ్ఞప్తి చేశారు.

# ఆసిఫ్-సుజనా కరచాలనం



**విజయవాడ పశ్చిమ, మే 13, (ఆంధ్రపత్రిక) :** పోలింగ్ సరళిని పరిశీలించడానికి వచ్చిన పశ్చిమ బిజెపి అభ్యర్థి సుజనా చౌదరి,వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ విద్యాధరపురంలోని లేబర్ కాలనీ హైస్కూల్ వద్ద ఎదురుపడ్డారు. సుజనా- ఆసిఫ్‌తో కరచాలనం చేసి ముచ్చటించారు. పార్టీలు వేరైనా ప్రత్యర్థిగా చూడనని, ఆసిఫ్ సోదర సమానుడని అన్నారు. కాగా అభ్యర్థులు ఇరువురూ పోలింగ్ సరళిని పరిశీలించడం జరిగింది.

## ఓటుహక్కు వినియోగించుకున్న టిడిపి నేత ఫతావుల్లా



**విజయవాడ పశ్చిమ, మే 13, (ఆంధ్రపత్రిక) :** స్థానిక అమ్మ హొటల్ సమీపంలోని ఆర్ సిఎం స్కూల్లో బూత్ నెంబర్ 198లో తెలుగుదేశం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయాన్నే పోలింగ్ బూత్‌కి వెళ్ళిన ఆయన ఓటు వేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని ఎన్నికల అధికారులను కోరినట్లు చెప్పారు.

## సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో ఆముక్త మాల్యద షణ్ముఖి ప్రతిభ



**విజయవాడ పశ్చిమ, మే 13, (ఆంధ్రపత్రిక) :** సీబీఎస్ఈ టెన్త్ పరీక్షల్లో ఆముక్త మాల్యద షణ్ముఖి మంచి ఫలితాలను సాధించడం అభినందనీయమని విజయవాడలోని శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానం పాలకమండలి చైర్మన్ వంజరపు సూర్యారావు అభినందించారు. ఈ పరీక్షల్లో ఆముక్తమాల్యద ఇంగ్లీషులో 93, హిందీలో 92 ,మ్యాథమెటిక్స్ స్టాండర్డ్ లో 89, సైన్స్ లో 95, సోషల్ సైన్స్ లో 98, అడిషనల్ సబ్జెక్ట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 94 మార్కులను సాధించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఆముక్త మాల్యద, ఆమె తల్లిదండ్రులు సవతం ఫణి కుమార్ శ్రీనివాస్, వాణి గురుకు మారిలను స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బంధుమిత్రులు అభినందించారు. రంగారెడ్డి జిల్లాలోని ద గ్లోబల్ ఎడ్జ్ స్కూల్లో ఆముక్త మాల్యద చదవడం జరిగింది.

# ఓటు వేసిన వైసీపీ పశ్చిమ అభ్యర్థి ఆసిఫ్



**విజయవాడ పశ్చిమ, మే 13, (ఆంధ్రపత్రిక) :** విజయవాడ పశ్చి మ నియోజకవర్గం 54వ డివిజన్ ఆర్ సి ఎం స్కూల్ లో 199 బూత్‌లో వైసీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తన ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ఈ సందర్భంగా షేక్అసిఫ్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమఓటు హక్కు వినియోగించుకోవాలనిచ అది మనందరి బాధ్యత అని అన్నారు. ఎలక్షన్ కమిషనర్ పోలింగ్‌బూత్‌లో ఏర్పాట్లు అన్నీ బాగానే చేశారన్నారు.కానీ ఒక గంట సేపు ఈవీఎంలు పనిచేయడం ఆగాయని, అధికారులు వచ్చి సరిచేసిన తర్వాత మళ్లీ పోలింగ్ మొదలైందన్నారు.ఉదయం గంట లేటుగా పోలింగ్ మొదలు అయింది కాబట్టి సాయంత్రం గంట సేపు సమయం పెంచాలని అధికారులను కోరడం జరిగిందన్నారు.

## ఓటు వేసిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్




**విజయవాడ పశ్చిమ, మే 13, (ఆంధ్రపత్రిక) :** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తన ఓటు హక్కును వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ వినియోగించుకున్నారు. సోమవారం ఉదయం భవానిపురం లోని సర్ ఆర్థర్ కాటన్ పబ్లిక్‌స్కూల్ లోని పోలింగ్ బూత్ నెంబర్ 24 లో ఆకుల శ్రీనివాస్ ఓటు వేశారు. ఈ సందర్భంగా పోలింగ్ తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని ఎన్నికలఅధికారులను ఆకుల శ్రీనివాస్ కోరడం జరిగింది.

## ఓటు వేసిన బుద్దా వెంకన్న దంపతులు




**విజయవాడ పశ్చిమ, మే 13, (ఆంధ్రపత్రిక) :** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఓటు హక్కును తెలుగుదేశం ఉత్తరాంధ్ర పార్లమెంటరీ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, ఆయన సతీమణి భూలక్ష్మి వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళి పట్ల బుద్ధా వెంకన్న సంతృప్తిని వ్యక్తంచేసారు.

# ఫతావుల్లా- ఆసిఫ్‌ల మధ్య వాగ్యుద్ధం



**విజయవాడ పశ్చిమ, మే 13, (ఆంధ్రపత్రిక) :** వైసిపి పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్, తెలుగుదేశం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా మధ్య వాగ్యుద్ధం చోటుచేసుకుంది. సోమవారం అమ్మ హొటల్ దగ్గర ఉన్న ఆర్సిఎం స్కూల్ బూత్ నెంబర్ 198 లో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగానే ఫతావుల్లా ఎంపీ అభ్యర్థికి ఓటు వేశారు. తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేసేందుకు వెళ్ళగా అక్కడ ఈవీఎం మొరాయించడంతో దాదాపు గంటసేపు ఓటింగ్ ప్రక్రియ నిలిచింది. ఈ లోగా ఓటింగ్ పరిశీలనలో భాగంగా అక్కడికి వచ్చిన వైసీపీ అభ్యర్థి ఆసిఫ్ పోలింగ్ బూత్‌లో పరిశీలిస్తూ వుండిపోయారు. దాదాపు గంట తర్వాత ఈవీఎం సరి కావడంతో ఫతావుల్లా వల్ల ఓటు వేసి బయటకు వచ్చినా ఆసిఫ్ లోపలే ఉండడం చూసి ఆయన్ని బయటికి పంపించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్యుద్ధం చోటుచేసుకుంది. చివరికి పోలీసులు అధికారులు ఇరువురికి నచ్చజెప్పి బయటకు పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## ఓటు వేసిన పోతిన మహేష్ కుటుంబం



**విజయవాడ పశ్చిమ, మే 13, (ఆంధ్రపత్రిక) :** స్థానిక వన్‌టౌన్‌లోని బస్వ అప్పలస్వామి మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్, రూమ్ నెంబర్ 2, బూత్ నెం.163 లో కుటుంబ సమేతంగా వైఎస్ఆర్సిపి నాయకులు పోతిన వెంకట మహేష్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం అన్నపూర్ణాదేవి స్కూల్,చిట్టినగర్ మట్టా లాజరు స్కూల్, ఎస్ఎఎస్ కళాశాల,మాలెంపాటి స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను సందర్శించి బూతులలో జరుగుతున్న ఓటింగ్ సరళిని పరిశీలించారు.

**కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న**

# పెడన టిడిపి అభ్యర్థి



**పెడన 13 మే (ఆంధ్రపత్రిక) :** పెడన నియోజకవర్గం జనసేన బిజెపి బలపరిచిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ వారి సతీమణి కాగిత శిరీష ,వారి తల్లి గారైన కాగిత మాణిక్యమ్మ ఈరోజు నాగేశ్వర రావు పేట గ్రామంలో 140 బూతు నెంబర్లలో తమ పవిత్రమైన ఓటును వినియోగించుకోవడం జరిగింది.. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేయడం జరిగింది.

**సతీ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న**

# ఉప్పాల హారిక రాము





**పెడన 13 మే (ఆంధ్రపత్రిక) :** పెడన మండలం కూడూరు గ్రామంలో తమ ఓటు హ క్కును వినియోగించుకు న్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) మరియు కృష్ణాజిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక

# విశాఖలో భారీగా వర్షం
# తడిసి ముద్దైన నగరం



**విశాఖపట్నం, మే 13 (ఆంధ్రపత్రిక):** విశాఖలో సోమవారం సాయంత్రం భారీగా వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎండ తాపానికి తట్టుకోలేని నగరవాసులు వర్షం పడటంతో ఒక్కసారిగా సేద తీరారు. సోమవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతగా కాశి ఒక్కసారిగా చల్లబడింది. వేసవిలో కన్వర్షన్ యాక్టివిటీ ఎక్కువగా ఉండటం వలన ఇటువంటి పరిణామాలు చోటు చేసుకుంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం విశాఖలో 36 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కాగా అత్యల్పంగా 26.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయిందని తెలిపారు. రాగల ఐదు రోజుల్లో ఉత్తర కోస్తా ప్రాంతంలో మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత బాగా ఉంటుందని ఆ తర్వాత ఒక్కసారిగా చల్లబడి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపారు.

### ఘనంగా జరిగిన
## శ్రీవేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం



**అమలాపురం, మే 13, ఆంధ్రపత్రిక:** కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో మూడు రోజుల పాటు జరుగుచున్న నవమ వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా రెండవ రోజు కార్యక్రమాలు 13వ తేదీ సోమవారం నాడు ఉదయం నిత్య హోమములు, అర్చన, లక్ష్మి హోమం, నీరాజనం మరియు మంత్రపుష్పం కార్యక్రమాలు జరిగాయి. తదుపరి శ్రీ దేవి,భూదేవి అమ్మవార్లకు స్త్రీలచే సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. అనేక మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవము వైభవంగా జరిగింది. అనేక మంది భక్త జనులు ఈ కార్యక్రమాన్ని తిలకించి తరించారు.మూడవ రోజు అనగా 14వ తేదీ మంగళ వారం ఉదయం సుదర్శన హోమమం, పూర్ణాహుతి, చక్ర స్నానం తదితర కార్యక్రమాలు జరుగును. మంగళ వారం మధ్యాహ్నం 3 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం జరుగును. సాయంత్రం 5 గంటలకు అర్చన, నీరాజనం, మంత్రపుష్పం మరియు తీర్థ ప్రసాద వితరణ జరుగును. ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులే అని, అమలాపురం పరిసర ప్రాంతముల భక్త మహాశయులందరూ ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొని, శ్రీ స్వామి వారి సేవలో తరించవలసినదిగా కిమ్స్ ఛైర్మన్ శ్రీ కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) తెలియజేసారు.

## దాడులతో ఓటమిని అంగీకరిస్తున్న బుగ్గన
### - కోట్ల సుజాతమ్మ

**డోన్, మే 13 (ఆంధ్ర పత్రిక):** ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగ్రామం బేతంచర్లలోనే ప్రజల నుంచి వ్యతిరేకత స్పష్టంగా కనిపించడం వల్ల ఓడిపోతానన్న భయంతో దాడులకు తెగబడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ ప్యాపిలిలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రాజా నారాయణమూర్తి పై పోలీసుల సహాయంతో దాడి చేయించడం అలాగే బేతంచర్లలో స్వతంత్ర అభ్యర్థి ఆయన అనుచరులు దాడికి దిగడం హేయమైన చర్య అని ఆమె మండిపడ్డారు. సొంత ఊర్లో కూడా మంత్రి బుగ్గన పై ప్రజలు అసంతృప్తితో ఉన్నారంటే ఆయన పనితీరు ఎలాంటిదో అర్థమవుతుందని ఆయన అన్నారు గతంలో కూడా ఆయన వ్యవహార శైలిపై ఎదురు మాట్లాడిన వారిని పోలీసు కేసులు అనుచరులతో దాడులు చేయించడం వంటి దిగజారుడు చర్యలతో ప్రజల మనసులో స్థానం కోల్పోయారని ఆమె అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటమి భయం వెంటాడుతుండటంతో మంత్రి బుగ్గన లో అసహనం పెరిగిపోయిందని ఆమె అన్నారు. అయితే ఆయన దాడులు చేసినా, భయభ్రాంతులకు గురిచేసినా ఎవరు ఆందోళన చెందవద్దని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



ఓటు హక్కును వినియోగించుకునేందుకుయు ఎస్ ఏ నుండి వచ్చిన యువకుడు.. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వాషింగ్టన్‌లో ఉంటున్న యువకుడు అమలాపురం వచ్చాడు. రాకుర్తి వెంకటేష్ అనే యువకుడు తన ఓటు హక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచాడు.

### ధర్మవరంలో
## పిడుగు పడి మూడు ఎద్దులు మృతి

**డోన్, మే 13 (ఆంధ్రపత్రిక):** డోన్ మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో సోమ వారం తెల్లవారుజామున మూడు గంటల సమయం లో పిడుగుపాటుకు మూడు ఎద్దులు చనిపోయాయి. సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం జరిగింది. గ్రామానికి చెందిన సంజప్ప కు చెందిన ఎద్దులను ఇంటి ఆవరణలో కట్టివేశారు. సోమవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులు రావడం తో పాటు పిడుగు పడడంతో మూడు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. కళ్ళం దొడ్డిలో నిద్రిస్తున్న రైతు సంజప్ప మనోజ్ కుమార్ కు గాయాలు అయ్యాయి. మనోజ్ ను చికిత్స నిమి త్తం హాస్పటల్‌కు కూడా తరలించడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు




అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి మండల ప్రజా పరిషత్ ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం-87 లో తన ఓటు హక్కు వినియోగించుకున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా.

## ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ

**అమలాపురం, మే 13 (ఆంధ్రపత్రిక):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొన సాగిందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు.. సాయంత్రం 6 గంటలకు క్యూలైన్లలో ఉన్న ఓటర్ల అందరికీ టోకెన్లు అందించి ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు వీలుగా ఫ్లడ్ లైటింగ్ ఏర్పాట్లు నిరంతరం విద్యుత్ సరఫరా ఏర్పాట్లు సుమా రు 1600 పోలింగ్ కేంద్రాలలో కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మార్గదర్శకాల కు అనుగుణంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని గత 2019 సంవత్సరం సార్వత్రిక ఎన్నికలలో 86% ఓట్లు పోలు అవ్వగా, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ ఈ 86 శాతానికి మించి పెరిగే అవకాశం ఉందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల సౌకర్యార్థం ఎండ వేడిమిని నుండి ఉపశమనం పొందే విధంగా షామియానాలు, త్రాగునీటి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. భారత ఎన్నికల సంఘం ఓటింగ్ శాతం పెంచే దిశగా తీసుకున్న చర్యలు ఫలించి వాటి ఫలితాలు క్షేత్రస్థాయిలో ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తున్నాయని ఆయన వెల్లడించారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి



**ఒంగోలు, మే 13 (ఆంధ్రపత్రిక):** ప్రకాశం జిల్లా టంగుటూరి మండలం కారుమంచి గ్రామంలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి తన ఓటు హక్కును వియోగించు కున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో చేదురుమదురు సంఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. నేటి ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్లో దాదాపు 20 వేల కోట్ల రూపాయలు ప్రధాన రాజకీయ పార్టీలు, అభ్య ర్థులు వ్యయం చేసి ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మార్చినారన్నారు. అభివృద్ధి, సుస్థిరత, విద్వేషరహిత రాజకీయాలకు అనుకూలంగా ఓటర్లు స్పందించార న్నారు. ఆంధ్రప్రదేశ్లో 2019లో 79.7 శాతం ఓటింగ్ జరగగా నేడు 82 శాతం కి ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని, పట్టణ ఓటింగ్ శాతం గతం కన్నా పెరుగుతుందన్నారు. నిరుద్యోగిత, పేదరికం, అసమానత లు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఓటర్ల స్పందన ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఓటింగ్ శాతం పెరగడానికి, ప్రధానంగా పట్టణ ఓటింగ్ శాతం పెరగటానికి, ఓటర్లను చైతన్యవంతులు చేయడానికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ బృందం చేసిన కృషి అభినందనీయమన్నారు. అధికార యంత్రాంగం చేస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకుని వెళ్లి సత్వర నివారణ చర్యలు చేపట్టడానికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కృషి చేసిందన్నారు.

## పోలింగ్ ప్రారంభమయ్యాక ఐవిఆర్ఎస్ కాల్స్

**అమరావతి,మే 13 (ఆంధ్రపత్రిక):** ఉదయం పోలింగ్ ప్రారంభమైన తర్వాత కూడా సీఎం జగన్ , మంత్రి విడుదల రజనీ పేరుతో ఐవీఆర్ఎస్ ఫోన్లు వచ్చాయి. అయితే ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కమిషన్‌కు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఓటర్లు కూడా ఫిర్యాదు చేశారు. జగన్, విడుదల రజనీ పేరుతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన వైసీపీకు ఓటు వేయాలని వస్తున్న ఐవీఆర్ఎస్ ఫోన్లపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నేతలు దేవినేని ఉమ, పంచుమర్తి అనురాధ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వీరిద్దరిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. ఐవీఆర్ఎస్ వాయిస్ ఉన్న పెన్ డ్రైవ్‌ను కూడా ఎన్నికల కమిషన్‌కు టీడీపీ నేతలు అందజేశారు. ఈసీ ఫిర్యాదుపై మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నెంబర్ 249/24 కింద కేసు నమోదు చేశారు.. పోలింగ్ ప్రారంభమైన తర్వాత ఐవీఆర్ఎస్ కాల్స్ రావడాన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకున్నది. ఈసీ ఆదేశాల మేరకు జగన్, విడుదల రజనీపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఓటు హక్కు వినియోగించుకున్న
# శ్రీ భరత్



**విశాఖపట్నం, మే 13 (ఆంధ్రపత్రిక):** తెలుగు దేశం విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఎం శ్రీ భరత్, ఓటు హక్కును వినియోగించు కున్నారు. శ్రీ భరత్ సతీమణి బాలకృష్ణ కుమార్తె తేజస్వినితో కలిసి రాంనగర్, పితాని దిబ్బ సేవాసదన్ స్కూల్ బూత్ నంబర్ 208, రూమ్ నంబర్ 6లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. విశాఖతో పాటు రాష్ట్రంలో కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### గాయాలైన వ్యక్తిని
## అస్పత్రికి తరలించిన బొత్స ఝాన్సీ



**విశాఖపట్నం, మే 13 (ఆంధ్రపత్రిక):** విశాఖ వైసీపీ ఎంపీ అభ్యర్థి ఝాన్సీ లక్ష్మి గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించేందుకు సోమవారం మధ్యాహ్నం భీమిలి నియోజకవర్గం సాగర్ నగర్ గుడ్లవానిపాలెం వెళ్లిన డాక్టర్ శ్రీమతి బొత్స ఝాన్సీలక్ష్మి ఫిట్స్ వ్యాధి తో రోడ్డు పై పడిపోవడంతో తలకు బలమైన గాయం అయ్యింది. ఆ యువకుడిని హుటా హుటిన తన వాహనంలో అస్పత్రికి తరలించారు. బాధితుని తల్లితో బాటు సమీప అస్పత్రికి వాహనంలో తరలించే ఏర్పాటు చేశారు.

### బస్కి పంచాయితీ దేవరపల్లి గ్రామంలో
## మొదటిసారిగా ఓటు వేసిన యువత



**అరకులోయ,మే 13 (ఆంధ్రపత్రిక):** అరకులోయ మండల బస్కీ పంచాయితీ దేవరపల్లి గ్రామంలో ఓటు వేసిన యువ నాయకులు వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరిన యువ నాయకులు శెట్టి ధర్మరాజు. సోన్నారి అప్పలరాజు. పాడి ప్రసాద్ అరకులోయ మండల బస్కీ పంచాయితీ దేవరపల్లి స్వగ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్న అరుకు నియోజకవర్గం దేవరపల్లి. బొండగూడ పాడిగూడ పిరిపోదురు దుంగ్యాపుటు దేవరపల్లి కింద వీధి గ్రామస్తులు మొత్తం ఓటు 642 పురుషులు 320 స్త్రీలు 322 పోలింగ్ 98 శాతం నమోదయింది. పోలింగ్ కేంద్రం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దేవరపల్లి గ్రామంలో జరిగింది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగింది.

## కొణతాలని ఎందుకు గెలిపించాలంటే..



**అనకాపల్లి, మే 13 (ఆంధ్రపత్రిక):** రాజకీయాలు కొందరికి వ్యాపారం మరికొందరికి ప్రజా ప్రయోజ నాలు కాపాడటం కోసం.. అందులో రెండో కోవకు చెందిన వ్యక్తి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ.. జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా రామకృష్ణ పోటీ చేస్తు న్నారు. అనుభవం.. అవగాహన.ఆశయం. ఆలోచన వివేకం కలిగిన వ్యక్తి రామకృష్ణ. అన్ని పార్టీల అగ్ర నేతలతో సంబంధాలు కలిగిన కొణతాల వంటి నేత గెలిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మంత్రి అవుతారు. గతంలో మాదిరిగానే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. 2004లో మంత్రిగా రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో పని చేశారు . అవినీతి అంటనీ నేతగా గుర్తింపు పొందారు..ఫ్లైఓవర్ బ్రిడ్జిలు... మెయిన్ రోడ్డు విస్తరణ.. పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి. రైతు బజార్ల నిర్మాణం ..రహదారుల విస్తరణ.. రహదారుల అభివృద్ధి.. సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ వంటి కార్యక్రమాలను ఆయన చేపట్టారు.. ఆయన అనుభవం మళ్లీ తిరిగి ఇప్పుడు పనికివచ్చే అవకాశం కనిపిస్తోంది. అందుకే ప్రజలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.. అనకాపల్లి అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.. నిరాడంబరత నిస్వార్థం అవినీతి రహిత ఆలోచన తన వారి కోసం పడే తపన కుటుంబ నేపథ్యం వంటివి ఆయనకి కలిసి వస్తున్నాయి ..అందుకే ప్రజలు ఆయనను కోరుకుంటున్నారు ..2 లక్షల పదమూడు వేల మంది ఓటర్లు ఉన్న అనకాపల్లి నియోజకవర్గంలో మెజారిటీ ప్రజలు ఆయనకు అందుకే మద్దతు ఇస్తున్నారు నిశితంగా ఆలోచించే మనస్తత్వం కలిగిన రామకృష్ణ గెలిస్తే నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర స్థాయి జాతరగా నిర్వహించటం.. సుమారు 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే 11 చెకెడ్యాములను పునరుద్ధరించడం..కాపు సామాజిక భవనం నిర్మాణం.. ఆర్ఈసీఎస్ ను సహకార రంగంలోకి తీసుకురావడం.. చెరుకు బెల్లం ఉత్పత్తులకు పునర్ జీవం తగిన గుర్తింపు వచ్చే విధంగా చర్యలు తీసుకో వటం వంటివి జరుగుతాయని ఆశిస్తున్నారు. అందుకే ఆయన కావాలని జనం కోరుకుంటున్నారు.

## కూటమి విజయ్ దుదిబ్ మోగిస్తుంది

**అనకాపల్లి, మే 13, ఆంధ్రపత్రిక :** 2024 ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి విజయదుందిబి మోగిస్తుందని నారా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ మోడీ దేశంలో రాష్ట్రంలో విక్టరీ సాధించబోతున్నారని, జగనాసుర వదకు ఓటర్లు తీర్పునివ్వబోతున్నారని, అన్ని వర్గాలను మోసగించిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి ముద్రపడ్డాడని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు ఈరోజు విలేకరుల సమావేశంలో వైసీపీ ప్రభుత్వం పై విరుచుకు పడ్డారు. కూటమి మేనిఫెస్టోను చూసి జగన్ రెడ్డికి నిద్ర పట్టడం లేదని, ఓటర్లు ఎక్కడ కోటమీ అభ్యర్థులకు ఓటు వేసేస్తారని ఆందోళనలో జగన్ రెడ్డి ఉన్నారని, పథకాలకు 1,62,342 లక్షల కోట్లు ఎక్కడినుండి తెస్తారని చంద్రబాబు నాయుడును ప్రశ్నిస్తున్నారని, పరిపాలన అనుభవం లేకపోవడంతో, ఇటువంటి చిల్లర విమర్శలు చేస్తున్నారని వెంకటరావు ఎద్దేవా చేశారు. 2014 నుండి 19 వరకు122 సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వంకు ఉందని అది తెలియని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ రెడ్డినని వెంకటరావు మండి పడ్డారు. సిడిఎస్ మాజీ చైర్మన్ కోట్ని ఉమా మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం, సమాజంలో ఆర్థిక అసమానతలు లేకుండా మగవారితో సమానంగా సమాజంలో తలెత్తుకునే విధంగా మహిళలను తీర్చిదిద్దిన వ్యక్తి చంద్రబాబు అని ఉమా అన్నారు. టౌన్ మహిళా సమైక్య అధ్యక్షురాలు కాయల ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయలేదని రుణమాఫీ పేరుతో కొంతమందికే లబ్ధి చేకూరే విధంగా ఉన్నాయని, రుణాలు చెల్లించిన సభ్యులకు వైసిపి ప్రభుత్వం వల్ల ఎటువంటి ప్రయోజనం కలగలేదని ప్రసన్నలక్ష్మి అన్నారు. తెలుగు మహిళా టౌన్ మాజీ అధ్యక్షురాలు బీశెట్టి హేమ కూటమి మేనిఫెస్టో వల్ల సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి రాబోయే ప్రభుత్వ%శీ% వల్ల లబ్ధి చేకూరుతుందని, బస్సుల్లో ఉచిత ప్రయాణం, సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తారని హేమ అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ డైరెక్టర్ కూరాకుల భారతి మాట్లాడుతూ 50 సంవత్సరాలు వయస్సున్న వారందరికీ 4000 పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని, ప్రస్తుతం 3000 ఇస్తున్న పెన్షన్ 4000 రూపాయలు ఇస్తారని ప్రతి నెల ఇంటి వద్ద ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారని భారతి తెలిపారు.

# డోన్‌లో ప్రశాంతంగా పోలింగ్

**- 80 శాతం పైనే ఓటింగ్**
**- మంత్రి బుగ్గన, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మధ్య వాగ్వివాదం**
**- పోలింగ్ బూత్ల వద్ద ఉద్రిక్తత**





**డోన్, మే 13 (ఆంధ్రపత్రిక) :** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ స్వల్ప ఉద్రిక్తల మధ్య నంద్యాల జిల్లా డోన్ లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని బిసి హాస్టల్, నవోదయ హై స్కూల్, సాయి శ్రీ డిగ్రీ కాలేజీ, జూనియర్ కాలేజీ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ పనితీరును పరిశీలించేందుకు వచ్చిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట సుజాతమ్మ వెదురుపడడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. జడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద సుజాతమ్మ మంత్రి బుగ్గన మధ్య వాగ్నివాదం చోటు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది వెంటనే పోలీసులు రంగంలోకి దిగి సర్ది చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. లోని పట్టణంలో ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్యాపిలి పట్టణంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజనారాయణమూర్తిపై పోలీసులు చేయి చేసుకు న్నట్లు సమాచారం అందడంతో సుజాతమ్మ రంగంలోకి దిగి పోలీసు లతో వాగివాదిని దిగింది. అక్రమంగా దానం చేయడం ఏమిటని ప్రశ్నించారు. తమ ఏజెంట్ల పై దౌర్జన్యాల దిగడం మంచి పద్ధతి కాదని సూచించారు. బేతంచర్ల లో ఇండిపెండెంట్ అభ్యర్థి పిఎన్ బాబుపై మంత్రి బుగ్గన అనుచరులు దాడికి పాల్పడి వాహనాన్ని ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులు అందాయి.

**డోన్ లో 80 శాతం పైనే పోలింగ్:**

ధోని నియోజకవర్గం లోని డోన్ ప్యాపిలి బేతంచర్ల మండలాల్లో 80% పైనే పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. డోన్ నియోజకవర్గంలో 227351 మంది ఓటర్లు ఉండగా 181567 ఓట్లు పోలైనట్లు రాత్రి 8 గంటల వరకు అందిన సమాచా రం. బేతంచర్ల మండలంలోని పలు గ్రామా ల్లో రాత్రి పొద్దుపోయే దాకా కూడా జరుగుతున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలియజేశారు.

**బేతంచర్లలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి బుగ్గన:**

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తమ ఓటు హక్కును బేతంచెర్ల పట్టణంలో వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి స్వగ్రామమైన లద్దగిరి లో వినియోగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల పోలింగ్ సరల్ని టిడిపి తరపున మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, కూతురు కోట్ల నివేదితమ్మ వైసీపీ తరపున మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పర్యవేక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో ప్రజలతోపాటు పోలీసు అధికారులు పోలింగ్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# చౌడేపల్లి మండలంలో పోలింగ్ ప్రశాంతం



**చౌడేపల్లి,మే13(ఆంధ్రపత్రిక):** చౌడేపల్లి మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఆలస్యంగా ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు దాటిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలుచోట్ల ఈవీఎంలు మురాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. ఇంకొన్ని పోలింగ్ కేంద్రాల్లో వచ్చే చోటు వెళ్లే చోటు ఒకే దారి కావడంతో కొందరు ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయాన్నే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్ల వద్ద బారులు తీరారు. పెద్దకొండా మరి, దుర్గ సముద్రం, దాదేపల్లి, తదితర ప్రాంతాల్లో ఈవీఎంలు మురారించాయి. అధికారుల అప్రమత్తమై వాటిని మరమ్మ తులు చేశారు. తీవ్ర ఎండ ఉక్కపోతకు కొందరు ఓటర్లు పోలింగ్ కేంద్రం నుంచి వెనిజురి గారు సాయంత్రం వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దురుకుసముద్రం పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు కొందరు వ్యక్తులకు వాగ్వాదం చోటుచేసుకుంది వాతావరణం పరిస్థితి నెలకొంది. అదేవిధంగా చౌడేపల్లి 102 పోలింగ్ కేంద్రం వద్ద ఉన్నత పాఠశాల ముందు కొందరు వ్యక్తిగత కారణాల ఘర్షణకు దిగారు, చెదురు నిధులు ఘటనలు మినహా మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

# సదుంలో 77 శాతం పోలింగ్



**సదుం మే 13, (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం లోసోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సదుం మండలంలో 77% పోలింగ్ జరిగింది. ఉదయం నుంచి మహిళలు భారీ సంఖ్యలో ఎన్నికల కేంద్రాలకు తరలివచ్చారు .10 గంటలకు మండలంలో 30% పోలింగ్ జరగా మధ్యాహ్నం ఒంటిగంటకు అమ్మగారి పల్లెలో 73 శాతం గొంగివారిపల్లె 77% తిమ్మానేనిపల్లి 60% నమోదయ్యాయి. సదుము పోలింగ్ కేంద్రాన్ని పుంగనూరు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజంపేట వైకాపా ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజంపేట బిజెపి అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి ,తెదేపా పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామ చంద్ర రెడ్డి వచ్చి పోలింగ్ సరళిని పరిశీలించారు. అదేవిధంగా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ కవిత పోలీస్ అబ్జర్వర్ నవాజ్ అహ్మదులు పరిశీలి ంచారు. నడిగడ్డ , బూరగ మంద గ్రామాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓటర్లు క్యూ లైన్ లో ఉండటంతో పోలిం గ్ కొనసాగుతోంది. మంత్రి స్వగ్రామం ఎర్రాతి వారి పల్లెలో పోలింగ్ కేంద్రంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన సతీమణి స్వర్ణమ్మ తల్లి పద్మావతమ్మ జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి జిల్లా వ్యవసాయ సలహా మండల సభ్యుడు సుధీర్ రెడ్డి వేణుగో పాల్ రెడ్డిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మండలంలో నడిగడ్డ గొంగివారిపల్లె,సదము, తిమ్మా నాయన పల్లెల్లో పలువురు దివ్యాంగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు, ప్రముఖులు















**హిందూపురం, మే 13 ( ఆంధ్రపత్రిక ):** సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును ప్రజాప్రతినిధులు, ప్రముఖు లు ఓటు ఉపయోగించుకున్నారు. ఈ సందర్భంగా వైస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, వైస్సార్సీపీ నాయకులు వేణు రెడ్డి, జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలయ్య కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిదంగా మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నాయకులు షేక్ మహమ్మద్ ఇక్బాల్, మాజీ ఎమ్మెల్యే సిసి వెంకట్రాముడు,వైస్సార్సీపీ మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ బిఎస్ విద్యా సాగర్, పలువురు నాయకులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**సోమల మే 13 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సోమల మండలం లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిన సంఘటన. 2024 వ సం.లో అసెంబ్లీ ,పార్లమెంటు ఎన్నికల ను నిర్వహించడానికి రాష్ట్ర ఎన్ని కల సంఘం గత 2 నెల ల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ పర్యాయం ఎన్నికల ను గతంలో జరిగిన అనుభవాలు దృష్టి లో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో లోనే సోమల మండలం లో 34 405 ఓటర్లు ఉండగా 80 శాతం పైగా 8.గం.లకు పోలైనట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఇంకా రెండు పోలింగ్ స్టేషన్లు లో అనగా టి.ఎం. గొల్ల పల్లి ,పొదల కుంట పల్లి లో పోలింగ్ కొనసాగుతునట్లు తెలిపారు.

మండలం లో సోమవారం జరిగిన పోలింగ్ లో ఒకటి ,రెండు చోట్ల చెదురు ముదురు సంఘటనలు మినహా మిగతా ప్రాంతాల్లో ప్రశాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం తీసుకొన్న చర్యలు అలాగే అధికారులు ,ఓటర్లు సహాయ సహకారాలు ,రాజకీయ నాయకుల సమయస్ఫూర్తి తో ప్రశాంతంగా ముగిసిన ట్లు తహశీల్దార్ నాగరాజ తెలిపారు.

## ఓటుహక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే వెంకటే గౌడ, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు





**వి.కోట మే13(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక శాసనసభ్యులు డా.ఎన్ వెంకటే గౌడ దంపతులు తమ ఓటుహక్కును స్వగ్రామమైన వి.కోట మండలం తొటకనుమ పోలింగ్ కేంద్రంలో సోమవారం ఉదయం వినియోగించుకున్నారు. అదేవిధంగా ఉమ్మడి జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు పట్రపల్లి కొత్తూరు పోలింగ్ కేంద్రంలో తమ ఓటువేశారు. తమ ప్రియతమ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టే జనరంజక పాలనకై మరోసారి యవత్ ఆంధ్ర ప్రజానీకం భారీ ఎత్తున బారులుతీరి మరి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## 15న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

### ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,మే13(ఆంధ్రపత్రిక):** నారాయణవనం శ్రీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15న ఉదయం 6.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ నెల 21 నుండి 29వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన టిడిపి అభ్యర్థి మురళీమోహన్



**బంగారుపాళ్యం,మే13(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కలికిరి మురళీమోహన్ సోమవారం జరుగుతున్న అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల బంగారుపాళ్యం మండలంలోని గుండ్లకట్టమంచి హై స్కూల్ లోని 162,163 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించి అనంతరం ఓటర్ల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బూత్ ఏజెంట్లను ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మృత్యుంజయుని ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



**చౌడేపల్లి,మే13(ఆంధ్రపత్రిక):** స్థానిక మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో జరగనున్న బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖర్ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి విషెస్ అభిషేక ము, అలంకరణ తెలిసిన తర్వాత గణపతి పూజ అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

## ఓటును సైకిల్ గుర్తుకు వేసిన డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, మే 13 ( ఆంధ్రపత్రిక) :** చిత్తూరు జిల్లా కుప్పం నియోజ కవర్గం ఆర్. స్ పేటలోని 166వ బూత్ నెంబర్ లో తమ ఓటును తూర్పు రాయలసీమ పట్టభద్రులు కుప్పం నియోజకవర్గసమన్వయ కర్త డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తన ఓటును సైకిల్ గుర్తుపై వేసినట్టు ప్రకటించారు.

## పోలింగ్ సరళిని పరిశీలించిన జెడ్పీ మాజీ చైర్మన్



**బంగారుపాళ్యం,మే13(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలను పోలింగ్ ప్రక్రియను రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ మాజీ జెడ్పీ చైర్మన్ ఎంబి కుమార్ రాజా పరిశీలించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి అక్కడ పోలింగ్ ఎలా జరుగుతా ఉందో అడిగి తెలుసుకున్నారు. వైసిపి పోలింగ్ ఏజెంట్లను నాయకులను కలిసి ఒక ఓటు కూడా మిస్ అవకుండా చూడాలని కోరారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న మాధవరావు దేశయ్



**నంధవరం మే13 ( ఆంధ్రపత్రిక):** 13 న జరిగిన సార్వత్రిక ఎన్నికల లో భాగంగా నందవరం గ్రామంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశాయ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసి తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఇక పోలింగ్ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద144 సెక్షన్ అమలు చేశారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న గురురాజ్ దేశాయ్



**నందవరం మే 13 ( ఆంధ్రపత్రిక):** టిడిపి నాయకులు గురురాజు దేశయ్ నిన్నటి రోజు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటు వేసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, వడ్డే మురళి ఓటు వేసి తమ హక్కులను వినియోగించుకున్నారు.
మండలంలో కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీయంలు మొరాయించి కొన్నిచోట్ల ఓటర్లు ఇబ్బంది పడిన సంఘటన చోటుచేసు కున్నాయి. మండలంలోని ఓటర్లు ఎండను లెక్కచేయకుండా తమ ఓట్లని వేసి ఓటు హక్కులను వినియోగించుకున్నారు. పట్టణాలకు వలస వెళ్లిన గ్రామ ప్రజలు గ్రామాలకు వచ్చి తమ ఓటు హక్కులను వినియోగించుకున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న నాగరాజు గౌడ్



**నందవరం మే 13 ( ఆంధ్రపత్రిక)** :టిడిపి సీనియర్ నాయకులు నాగ రాజుగౌడ్ నిన్నటి రోజు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటు వేసి తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.మండల టిడిపి నాయకులు చిన్న రాముడు,రహిమాన్ భాష, మహేష్, రఫిక్ లు ఓటు వేసి తమ హక్కులను వినియోగించుకున్నారు.

## గ్రామ పంచాయతీకి చెందిన కళ్యాణ్ వారి సన్నిహితులుతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు



**కుప్పం, మే 13 ( ఆంధ్రపత్రిక) :** చిత్తూరు జిల్లా కుప్పం నియోజక వర్గం శాంతిపురం మండలం చల్దిగానిపల్లి గ్రామ పంచాయతీ కి చెందిన కళ్యాణ్ వారి సన్నిహితులు తో కలిసి ఓటు హక్కును వినియో గించుకున్నారు. సేవ అంటే కుప్పం లో కళ్యాణ్ ఫౌండేషన్ కళ్యాణ్ ఫౌండేషన్అంటే కుప్పం. అన్నంత పేరును సంపాదించు కున్న గొప్ప సేవాతత్పరులు కుప్పం యువ కెరటాలైన డా.ఎం. పవన్ కళ్యాణ్ ఉపాధ్యక్షులు డా.సి.ఉమాపతి మరియు కార్యదర్శి డా.సుధాకర్ రెడ్డి తమ ఓటును గుండిశెట్టి పల్లి లో వినియోగించు కోవటం జరిగిందని తెలియచేసారు

## గూడూరులో ప్రశాంతంగా పోలింగ్

**- పెరిగిన పోలింగ్ శాతం.- పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా.- ఓటు ను వినియోగించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు.**





**గూడూరు,మే 13 ( ఆంధ్రపత్రిక) :** సార్వత్రిక ఎన్నికల నేపద్యం లో గూడూరు లో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఉదయము 7 గంటల నుండి ఓటు వేసేందుకు ప్రజలు క్యూ లైన్ లో నిలబడ్డారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ ను అమలు చేశారు. పోలింగ్ కేంద్రం నుండి వంద మీటర్ల దూరంలో వాహనాల ను నిలిపి వేశారు. తిరుపతి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి వెలగ పల్లి వరప్రసాద్ రావు , ఆయన సతీమణి , తనయుడు నవీన్ గుప్తాలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా ఎన్.డి. ఏ కూటమి , టీడీపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గూడూరు రిటర్నింగ్ అధికారి కిరణ్ కుమార్ ఓటు వేశారు. సుమారు గూడూరు నియోజక వర్గంలో సాయంత్రం 5 గంటలకు గాను 2,45, 205 మందికి గాను 1,79,280 ఓటర్లు వినియోగించుకున్నారు. సుమారు 73.11శాతం నమోదు అయింది. ఎక్కడా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

# పాఠశాలలకు బాంబు బెదింపులు

(మొదటిపేజీ తరువాయి)

కాదు. తాజాగా ఉత్తరప్రదేశ్ లక్నోలోని గోమతి నగర్‌లో పలు పాఠశాలలకు సోమ వారం ఉదయం ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే పాఠశాలలోని విద్యార్థులను గ్రౌండ్‌లోకి తరలించి.. మీ పిల్లలను ఇంటికి తీసుకు వెళ్లాలంటూ.. వారి తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం సమాచారం అందించింది. మరోవైపు పోలీసులు, భద్రత సిబ్బంది, బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్ బృందం ఆ యా పాఠ శాలలకు చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తుంది. ఇంకోవైపు ఆదివారం న్యూఢిల్లీలోని బురారీ, సంజయ్ గాంధీ ఆసుపత్రులకు సైతం బాంబు బెదిరింపులు వచ్చాయి.అలాగే అంతకుముందు న్యూఢిల్లీలోని వివిధ పాఠశాలలకు ఇదే తరహాలో బాంబు బెదిరింపులు అందాయి. ఇక నాగపూర్, గోవా, జైపూర్ విమానాశ్రయాలకు సైతం బాంబు బెదిరింపులు అందాయి. పోలీసులు, భద్రత సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి ఇవన్నీ నకిలీ బెదిరింపులని వారు తేల్చి చెప్పారు. ఇంకోవైపు.. ఈ బాంబు బెదిరింపులపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిఎం పదవి నుంచి తొలగించాలనడం అవివేకం

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. ఆయన ఇటీవలే బెయిల్‌పై బయటకి వచ్చారు. అయితే జైలు శిక్ష అను భవిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని పేర్కొంటూ కాంతి భాటీ అనే వ్యక్తి ఏప్రిల్‌లో ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్ విచారణకు హైకోర్టు నిరాకరించడంతో ఆయన సుప్రీం తలుపు తట్టారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేజ్రీవాల్‌ని సీఎం పదవి నుంచి తొల గించాలని అడిగే చట్టపరమైన హక్కు పిటిషనర్‌కి లేదని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీంతో కేజ్రీవాల్‌కి భారీ ఊరట లభించినట్లైంది.

# లిప్‌స్టిక్‌పై నార్త్ కొరియాలో నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. ఎక్కువగా మేకప్ వేసుకున్నవాళ్లను నార్త్ కొరియన్లు పట్టించుకోరు. మేకప్ వేసుకోవడాన్ని పశ్చిమ దేశాల సంస్కృతిగా ఉత్తర కొరియన్లు భావిస్తున్నారు. ఎరుపు రంగు లిప్‌స్టిక్ వేసుకున్నవాళ్లు ఎక్కువ అట్రాక్టివ్‌గా కనిపిస్తారని కొరియన్లు భావిస్తున్నారు. ఇది ప్రభుత్వ వైఖరికి విరుద్ధమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళలు సాదాసీదాగా ఉండాలన్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకం అన్న విధానాన్ని పాటిస్తున్నారు. అందుకే అక్కడి చట్టాల ప్రకారం.. మహిళలు అతి తక్కువ స్థాయిలో మేకప్ ధరించాల్సి ఉంటుంది.రెడ్ లిప్‌స్టిక్ ఒక్కటే కాదు.. వ్యక్తిగతంగా అందంగా కనిపించాలన్న అంశాలపై ఉత్తర కొరియాలో అనేక ఆంక్షలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కిమ్ జాంగ్ ఉన్ సర్కారు అనేక కాస్మటిక్ వస్తువులను బ్యాన్ చేసింది. మహిళలు స్కిన్నీ, బ్లూ జీన్స్ వేసుకోరాదు. బాడీ పియర్సింగ్, హెయిర్‌స్టయిల్స్, ముల్లెట్స్, పొడుగైన కురులు ఉండరాదు. కేవలం సర్కారు అనుమతి ఇచ్చిన హెయిర్‌స్టయిల్స్‌లో మాత్రమే మహిళలు, పురుషులు కనిపించాల్సి ఉంటుంది. కొన్ని సిద్ధాంతపరమైన ఆంక్షలు కూడా నార్త్ కొరియాలో ఉన్నాయి. బ్లాక్ ట్రెంచ్ కోట్లను ధరించరాదు. ఎందుకంటే కిమ్ వేసుకున్న స్టయిల్ డ్రెస్సులను మరొకరు వేసుకోరాదు. తనను ఎవరూ కాపీ కొట్టరాదన్న అభిప్రాయాన్ని కిమ్ వ్యక్తం చేశారు. ఫ్యాషన్ విషయంలో ఎవరు ఎలా ఉంటున్నారో పర్యవేక్షించేందుకు ప్రత్యేక పోలీసులు బృందాలు నిఘా పాటిస్తుంటాయి.

# సర్వేలు చెప్పడం మానేశాను

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని ఓ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు వేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి సర్వే ఫలితాలను చెప్పడం మానేశానన్నారు. ఇంతకు ముందు రాజకీ యాల్లో ఉన్న సమయంలో ప్రజల నాడి తెలుసుకునేవాడినని.. ప్రస్తుతం తాను ఇప్పుడు రాజకీయాల్లో లేనన్నారు. మళ్లీ రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనేమీ లేదని స్పష్టం చేశారు. ఏపీలో ఎప్పుడూ లేనివిధంగా ఓటింగ్ బాగానే జరుగుతుందని చెప్పారు. మధ్యాహ్నం సమయంలో ఖాళీగా ఉంటుందని ఓటు వేసేందుకు వచ్చానన్నారు. కానీ, ఎక్కడ చూసినా జనాలు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారని.. ఉత్తేజంగా జనం ఓటు వేసేందుకు ముందుకు వచ్చారన్నారు. ప్రజాస్వా మ్యంలో ఓటు విలువైందని.. అలాంటి ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎన్నికలతో హైదరాబాద్ ఖాళీ అయ్యిందని.. ప్రజలందరూ ఓట్లు వేయడానికి బస్సుల్లో, విమానాలు, రైళ్లలో వస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఎవరు గెలువబోతున్నారో తాను చెప్పలేనని.. జూన్ 4న అందరికీ తెలుస్తుందన్నారు. మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్‌కు ఆంధ్రా ఆక్టోపస్‌గా పేరున్నది. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే విషయంపై ఆయన సర్వేలు నిర్వహించే.. వెల్లడిస్తుండేవారు. ఆయన సర్వే ఫలితాలపై రాజకీయ వర్గాలతో పాటు జనంలోనూ ఆసక్తి ఉండేది. అయితే, 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సర్వే ఫలితాలు తారుమారయ్యాయి. ఆ తర్వాత ఆయన సర్వేలు నిర్వహించడం, ఫలితాలను వెల్లడించడం మానేరు. రాజకీయాలకు సైతం గుడ్‌బై చెప్పారు.

# మోదీ మతపర ప్రసంగాలు?

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘించారని, ఆయనపై చర్యలకు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం నాడు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని, విచారణకు అర్హమైనది కాదని జస్టిస్ సచిన్ దత్తా తీర్పునిచ్చారు.పిటిషనర్లు చేసిన ఫిర్యాదును చట్టానికి అనుగుణంగా స్వతంత్రంగా అంచనా వేసి చర్య తీసుకునే అధికారం ఎన్నికల కమిషన్‌కు అందని కోర్టు స్పష్టం చేసింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదనందున తోసిపుచ్చు తున్నట్టు పేర్కొంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడినట్టు ముందుగానే పిటిషనర్ ఒక నిర్ణయానికి రావడం పూర్తిగా అనుచితమని కూడా కోర్టు తెలిపింది. ప్రధాన మంత్రి, ఇతర బీజేపీ నేతల విద్వేష ప్రసంగాలపై ఈసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిటిషనర్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని బన్స్వారాలో ఈనెల 21న ప్రధానమంత్రి చేసిన ప్రసంగాన్ని వారు ప్రస్తావిం చారు. షహీన్ అబ్దుల్లా, అమితబ్ పాండే, దేబ్ ముఖర్జీ అనే ముగ్గురు హైకోర్టులో ఈ పిటిషన్ వేశారు. విద్వేష ప్రసం గాలు చేసిన రాజకీయ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదుతో సహా తక్షణ చర్యలు తీసుకునేలా ఈసీఐని ఆదేశించాలని కోర్టును వారు కోరారు.

# ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విషయం తెలిసిందే. కేరళ వయనాడ్ ఎంపీ స్థానం మరోసారి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఆయన సిట్టింగ్ ఎంపీ. అలాగే, కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీలో సైతం బరిలోకి దిగారు. ఇక్కడ ప్రచారంలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సభలో పాల్గొన్న పలువురు జనం రాహుల్ జీ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్పందిస్తూ.. 'ఇప్పుడు నేను త్వరలో పెళ్లి చేసుకోక తప్పేలా లేదు (అబ్ జల్దీ హి కర్నీ పడేగీ)' అని నవ్వి అభివాదం చేస్తూ ప్రసంగాన్ని ముగించారు. అక్కడే ఉన్న ప్రియాంక గాంధీ సైతం నవ్వుతూ ఉండడం కనిపించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ మొన్నటి వరకు పోటీ చేస్తూ వచ్చారు. ఆమె స్థానంలో రాహుల్ గాంధీ పోటీలో ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం ప్రియాంక గాంధీతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో బీజేపీ, ఎన్డీయే సర్కారు వైఖరిపై ఆయన తీవ్రంగా స్పందించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా రాయ్‌బరేలితో కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.ఇందిరా గాంధీ, సోనియా గాంధీ ఇక్కడి నుంచే పోటీ చేశారన్న రాహుల్.. ఇది తమకు కర్మభూమి లాంటిదన్నారు.

# ఓట్ల జాతర

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఓటేశారు. పవన్ కళ్యాణ్ మంగళగిరిలో ఓటేశారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన సతీమణి వసుంధరతో కలిసి ఆయన ఓటు వేశారు. హిందూపురంలోని ఓ పోలింగ్ కేంద్రంలో వారు తమ ఓటును వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రం బయట బాలకృష్ణ దంపతులు తమ వేళ్లకు ఉన్న సిరా గుర్తులను చూపించారు. నటుడు బాలకృష్ణ ప్రస్తుతం హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా ఆయన మరోసారి అక్కడి నుంచే బరిలో నిలిచారు. ఏపీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దంపతులు సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. కడప పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిల, భర్త అనిల్‌తో కలిసి ఇడుపులపాయ లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.రైల్వేకోడూరు లో వైసీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అధికారులు, పోలీసులు నిస్వార్థంగా పనిచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలసిన బాధ్యత ఉందని కోరారు. బిజెపి అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఓటేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంగళగిరిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రానికి తన సతీమణితో కలిసి వచ్చారు. అయితే కేవలం పవన్ కళ్యాణ్ మాత్రమే ఓటు వేశారు. ఏపీలో ఉదయం 7 గంటలకే పోలింగ్ పక్రియ ప్రారంభమైంది. ఓటు వేసేందుకు ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. ఈ నేపథ్యంలోనే మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి కాలనీలోని గిరిజన కోపరేటివ్ సంస్థ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పవన్ ఓటు వేశారు. పవన్ కళ్యాణ్ ఈ పోలింగ్ సెంటర్‌కు వస్తున్నారన్న విషయం తెలుసుకుని పెద్ద ఎత్తున అభిమానులు తరలి వచ్చారు. ఒకానొక సందర్భంలో పోలింగ్ బూతులోకి దూసుకొని వచ్చారు కొందరు వీరాభిమానులు.

# సమయం ముగిసిన క్యూలైన్లు




**అమరావతి, మే 13 (ఆంధ్రపత్రిక):** ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటలకు అధికారికంగా ముగిసింది. అయితే అప్పటికే క్యూలో నిల్చున్న వారికి మాత్రం ప్రత్యేకంగా స్లిప్పులు ఇచ్చి ఓటు వేసేందుకు అనుమతిస్తున్నారు. ఇలా పలు నియోజకవర్గాల్లో ఓటర్లు ఇంకా పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి ఉన్నారు. వీరందరికీ పోలింగ్ పూర్తయ్యే సరికి రాత్రి 10 గంటలు దాటుతుందని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ పాతబస్తీ మీర్ చౌక్ వద్ద ఉద్రిక్తత: ఒకే మార్గంలో మాధవీలత, అసదుద్దీన్ ఒవైసీ మరోవైపు రాష్ట్రంలో ఇవాళ జరిగిన ఎన్నికల పోలింగ్ లో పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా పల్నాడు, రాయలసీమ జిల్లాలతో పాటు కోస్తాలోని పలు జిల్లాల్లోనూ హింస ప్రజ్వరిల్లింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో రీపోలింగ్ నిర్వహిస్తారని అంతా భావించారు. కానీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా మాత్రం ఆయా సీట్లలో రీపోలింగ్ నిర్వహించడం లేదని తేల్చిచెప్పేశారు. దీనికి గల కారణాలను కూడా వివరించారు. రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నప్పటికీ రాజకీయ పార్టీలు రీపోలింగ్ కోరలేదని సీఈవో ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. దీంతో ఈసీ కూడా వీటిని చెదురుమదురు ఘటనలుగానే చూస్తున్నట్లు తెలుస్తోంది. సహజంగా రాజకీయ పార్టీల నుంచి రీపోలింగ్ డిమాండ్లు వచ్చినప్పుడు మాత్రమే ఈసీ వీటిని పరిశీలించి ఓ నిర్ణయం తీసుకుంటుంది. కానీ ఇవాళ జరిగిన హింసాత్మక ఘటనల్లో ప్రధాన పార్టీల నాయకుల ప్రమేయం ఉండటంతో వీటిలో రీపోలింగ్ కు అవి డిమాండ్ చేయలేదని తెలుస్తోంది. మరోవైపు ఇవాళ సాయంత్రం వరకూ రాష్ట్రవ్యాప్తంగా 75 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ అంచనా వేస్తోంది. రాత్రి 10 గంటల కల్లా క్యూలో ఉన్న వారి ఓటింగ్ కూడా పూర్తయితే పోలింగ్ శాతం 80 దాటొచ్చని అంచనా. దీంతో గత ఎన్నికల కంటే ఎక్కువగానే పోలింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ఇలా నమోదైన ఎక్కువ ఓటింగ్ ఏ రాజకీయ పార్టీని ముంచుతుందో, ఇంకెవరిని తేలుస్తుందో జూన్ 4న తేలనుంది.

# ఈ పోలింగ్ చారిత్రాత్మకం

(మొదటిపేజీ తరువాయి)

చారిత్రాత్మక దినంగా అభివర్ణించిన ఆయన.. ఓటు వేసేందుకు ప్రజలు చూపుతున్న ఉత్సాహం స్ఫూర్తిని నింపుతోందని అన్నారు. నిర్దేశిత పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. చాలా ప్రాంతాల్లో ఓటర్లు 6 గంటలకు కూడా క్యూ లైన్‌లో బారులు తీరి ఉన్నారన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాను పరిశీలించి.. వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుండగా.. ఈ ఎన్నికల్లో ఏపీ ఓటర్లు ఎంతో చురుకుగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో గందరగోళ వాతావరణం నెలకొన్నా, అనుకోని సంఘటనలు చోటు చేసుకున్నా, వర్షాలు పడినా.. లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. సాయంత్రం 5 గంటల వరకు ఏపీలో 67.99 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.13 కోట్లకు పైగా ఓటర్లు ఉండగా.. 2 కోట్ల 71 లక్షలకు పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 1.30 కోట్లకు పైగా పురుషులు ఉండగా, 1.40 కోట్లకు పైగా మహిళలు ఉన్నట్లు తేలింది. పురుషులతో పోలిస్తే.. మహిళలే ఈ పోలింగ్‌లో ఎక్కువగా పాల్గొన్నారు.

# కాశీ వీధుల్లో మోదీ భారీ రోడ్‌షో

(మొదటిపేజీ తరువాయి)

విద్యావేత్త, సంఘ సంస్కర్త మదన్ మోహన్ మాలవ్య విగ్రహానికి ప్రధాని మోదీ పూలమాల వేసి నివాళులర్పించారు. మంగళవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్న ప్రధాని మోదీ వెంట ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రోడ్‌షోలో పాల్గొన్నారు. 7వ దశ లోక్‌సభ ఎన్నికలలో జూన్ 1న వారణాసి స్థానానికి పోలింగ్ జరగనున్నది. ప్రధాని మోదీ వరుసగా మూడవ పర్యాయం ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. మాతృశక్తికి ప్రతిరూపంగా కాషాయ రంగు వస్త్రాలు ధరించి మహిళలు పెద్ద సంఖ్యలో మోదీ ప్రయాణిస్తున్న వాహనం ముందు నడిచారు. మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, మహేశ్వరి, మార్వారీ, తమిళ, పంజాబీ తదితర భాషలకు చెందిన ప్రజలు 11 జోన్లలోని 100 పాయింట్ల వద్ద ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలికారు.శంఖనాదాలు, డోలు, దమరుక వాయిద్యాల హోరుతో రోడ్‌షో మార్మోగిపోయింది. రోడ్‌షో మార్గం పొడవునా కాశీ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యక్తుల కటౌట్లను అమర్చారు. సంత్ రవిదాస్ గేట్, అస్సీ, శివాల, సోనార్‌పురా, జంగంబాడి, గోదౌలియా మీదుగా రోడ్‌షో కాశీ విశ్వనాథుని ఆలయం వరకు సాగింది. అనంతరం గంగానదిలో పుణ్య స్నానమాచరించిన మోదీ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం బిఎల్‌డబ్లు అతిథిగృహంలో ప్రధాని మోదీ రాత్రి బసచేశారు. కాశీ విశ్వనాథుని మందిరం నుంచి బయల్దేరిన ప్రధాని మోదీ కాన్వాయ్ మైదాగిన్ చౌరహా, కబీర్‌చౌర, లాహురబీర్ తేలియాబాగ్ తిరాహా, చౌకాఘాట్ చౌరాహా, లక్షీ మండి, కంటోన్మెంట్ ఓవర్‌బ్రిడ్జి, లహర్తరా, మండూవాదీ చౌరహా, కాకర్‌మట్ట ఓవర్‌బ్రిడ్జి ప్రాంతాల మీదుగా బిఎల్‌డబ్లు అతిథిగృహం చేరుకుంది

# ముంబైలో ఈదురుగాలుల బీభత్సం

**ముంబై,మే 13:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో సోమవారం సాయంత్రం భారీ ఈదురుగాలులు పెను బీభత్సం సృష్టించాయి. తేలికపాటి వర్షంతో పాటు బలమైన గాలులు వీచడంతో ఘట్కోపార్ ప్రాంతంలో భారీ హోర్డింగ్ పేకమూడలా కుప్పకూలి నలుగురు దుర్మరణం పాలయ్యారు. సుమారు 57 మంది గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రంగంలోకి దిగి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. హోర్డింగ్ కింద సుమారు 100 మంది చిక్కుకుని ఉంటారని అంచనా వేస్తున్నారు. ఘట్కోపార్ ప్రాంతంలో భారీ బిల్‌బోర్డ్ కుప్పకూలి పెనువిపత్తు సంభవించిన ఈ ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్టు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. 'బిల్‌బోర్డ్ కింద చిక్కుకున్న 47 మందిని ఇంతవరకూ సురక్షితంగా బయటకు తెచ్చాం. యుద్ధప్రాతిపదికన ముంబై పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్, డిజాస్టర్ మేనేజిమెంట్ సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాం' అని ఫడ్నవిస్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు.బ్రృహాన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భూషణ్ గగ్రాని ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియజేస్తూ, ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్‌ను కూడా రంగంలోకి దింపామని, గ్యాస్ కట్టర్లను కూడా ఘటనా స్థలికి పంపామని చెప్పారు. హోర్డింగ్ కుప్పకూలిన ఘటనపై రైల్వే అండ్ అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీ ఎగో మీడియాపై డిజాస్టర్ మేనేజిమెంట్ యాక్ట్ కింద బీఎంసీ ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కాగా, క్షతగాత్రులను చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఎపి ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు

(మొదటిపేజీ తరువాయి)

పరిగణించింది. దాడులకు పాల్పడిన వారిపై గృహనిర్బంధంతో పాటు కేసులు పెట్టాలని ఈసీ ఆదేశించింది. పుంగనూరులో నిందితులను వదిలేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని ఆదేశించింది. సాయంత్రం 4-6 గంటల మధ్య ఎలాంటి ఘటనలు జరిగినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలుగుదేశం పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈమేరకు తెదేపా అధినేత చంద్రబాబు రాసిన లేఖతో పాటు మరో 11 ఫిర్యాదులను మాజీ ఎంపీ కనక మేడల రవీంద్ర కుమార్ ఈసీకి అందజేశారు. ఉదయం నుంచి రాష్ట్రంలో 120కి పైగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెనాలి వైకాపా అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌పై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. పోలింగ్ పూర్తయ్యే వరకు శివకుమార్‌ను గృహనిర్బంధంలోనే ఉంచాలని పేర్కొంది. పోలింగ్ కేంద్రంలో శివకుమార్ క్యూలైన్‌లో వెళ్లకుండా నేరుగా వెళ్లడంపై ఓటరు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన శివ కుమార్.. ఓటరు చెంపపై కొట్టారు. వెంటనే ప్రతిఘటించిన ఓటరు.. వైకాపా అభ్యర్థి చెంప చెళ్లుమని పించారు. అనంతరం శివకుమార్ అనుచరులు ఓటరుపై విచక్షణా రహితంగా దాడికి దిగారు. ఈ ఘటన ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఇసికి టిడిపి ఫిర్యదు చేసింది.ఉదయం నుంచి ఏపీలో 120కి పైగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని తెదేపా మాజీ ఎంపీ కనక మేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పోలింగ్ వేళ శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. ఈమేరకు తెదేపా అధినేత చంద్రబాబు రాసిన లేఖతో పాటు మరో 11 ఫిర్యాదులను కనకమేడల ఈసీకి అందజేశారు. అనం తరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అన్ని చోట్లా వైకాపా నేతలు హింసకు పాల్పడుతున్నారు. తెదేపా కార్యకర్తలు, ఏజెంట్లు, నేతలపై దాడి జరుగుతున్నా.. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు సహ కరిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వైకాపా అభ్యర్థులు, నేతలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నారు. తెనాలి, తాడిపత్రి, నరసరావుపేట వైకాపా అభ్యర్థులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. పల్నాడు, తాడిపత్రి, పులివెందుల సహా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరిగాయి. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని ఈసీ దృష్టికి తీసుకెళ్లాం. పలుచోట్ల పోలింగ్ నిలిపివేయడం దారుణం. ఈవీఎంలు ధ్వంసం చేసి, పలు చోట్ల ఓట్లు వేయకుండా ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. శాంతిభద్రతల పరిణామాలు, ఓటింగ్ తీరు ఆందోళన కలిగిస్తోంది. హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాల్లో మరోసారి పోలింగ్ నిర్వహించాలని కోరాం అని కనకమేడల తెలిపారు.

## వైకాపాపై ఓట్లతో ప్రజల తిరుగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు అధికారపార్టీ చేసిన అన్ని ప్రయత్నాలను తిప్పికొడుతూ పోలింగ్ కేంద్రాలవద్ద ఓట్లతో తిరుగుబాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి అభినందనలు అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏపీ ఓటింగ్ సరళిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. తెల్లవారుజాము నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటుహక్కు వినియోగించు కునేందుకు బారులు తీరడం వెల్లివిరిసిన ప్రజాచైతన్యానికి నిదర్శనం. భావితరాల భవిష్యత్తు కోసం అరాచకశక్తులకు ఎదురొడ్డి ఎపి ప్రజలు చూపిన తెగువ చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఉప్పెనలా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చిన ఓటరు దేవుళ్లకు పాదాభివందనాలు తెలియజేస్తున్నాను. పార్టీ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శ్రమించిన నాయకులు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు అని పేర్కొన్నారు. తాను పోటీ చేసిన మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు నారా లోకే ధన్యవాదాలు తెలిపారు. మంగళగిరి చైతన్యానికి మారుపేరని మరోమారు నిరూపితమైంధి. తెల్లవారకముందే నియోజకవర్గ ప్రజలు పోలింగ్ బూతుల వద్ద బారులుతీరి ఉత్సాహంగా ఓటుహక్కు వినియోగించుకోవడం శుభపరిణామం. సాయంత్రం 6గంటలకు కూడా ఓటుహక్కు వినియోగించు కునేందుకు ఓపిగ్గా పోలింగ్ బూతుల్లో వేచిఉండటం వెల్లివిరిసిన ప్రజాచైతన్యానికి ప్రతీక. పెద్దఎత్తున ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న నా మంగళగిరి కుటుంబ సభ్యులకు, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

## ధర్మవరంలో ప్రజాస్వామ్యం అపహాస్యం

### బిజెపి అభ్యర్థి సత్యకుమార్ ఆగ్రహం

**ధర్మవరం, మే 13 (ఆంధ్రపత్రిక):** ధర్మవరంలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని బిజెపి అభ్యర్థి సత్య కుమార్ ధ్వజమెత్తారు. రిగ్గింగ్‌కు పాల్పడుతున్న పోలీస్ యంత్రాంగం ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. పోలీసుల నిర్లక్ష్యంపై సత్య కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి ఓటమి భయంతో అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. ఏకంగా వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సోదరుడు వెంకట కృష్ణారెడ్డి తన అనుచరులతో పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసు కున్నాయి. ఈ విషయం తెలుసుకున్న కూటమి ఎన్డీఏ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్య కుమార్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఏపీలో సార్వత్రిక ఎన్నికల కోసం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ మొదలైంది. 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల కోసం ఈ ఎన్నికలు జరిగాయి. పలు నియోజకవర్గాల్లో కీలక నేతల మధ్య గట్టి పోటీ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ధర్మవరంలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. 4వ వార్డు శాంతినగర్‌లో ఉన్న పోలింగ్ కేంద్రం 164, 169, 170, 171 బూత్‌ల వద్ద రిగ్గింగులకు వైఎస్సార్సీపీ మూకలు పాల్పడినట్లు సమాచారం.

# తెలంగాణలో ముగిసిన పోలింగ్..

**హైదరాబాద్,మే 13 (ఆంధ్రపత్రిక):** తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ పక్రియ ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగింది. పలు పోలింగ్ కేంద్రాల్లో 6 గంటలలోపు నిల్చున్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించు కునేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు.అక్కడక్కడ చెదురుముదురు సంఘటనలు మినహా సజావుగా పోలింగ్ కొనసాగింది. కాగా వనపర్తి జిల్లా అమరచింత జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్ 228/77లో ఈవీఎంలు మొరాయించాయి. రెండు గంటలుగా ఈవీఎంలు పని చేయకపోవడంతో ఓటింగ్‌ను నిలిపివేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్నం 3 గంటల వరకు 52.34 శాతం పోలింగ్ నమోదైంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో 39.92 శాతం పోలింగ్ నమోదైంది. మంథని..బెల్లంపల్లి లో ఎక్కువ శాతం ఓటర్లు క్యూ లైన్లో వేచి ఉన్నారు. అలాగే మంచిర్యాల లో సమయం ముగిసినప్పటికి ఓటర్లు బారులు తీరారు. అయితే ఉదయం నుంచే మందకొడిగా పోలింగ్ ప్రారంభం అయ్యింది. నగరంలో అయితే ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్ నమోదైంది. 65 శాతం దాకా పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉందని అన్నారు. ఇక సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు కూడా పోలింగ్ పక్రియ ముగిసింది. తెలంగాణలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 13 అసెంబ్లీ నియోజక వర్గాల్లో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. సాయంత్రం 4 గంటలకు క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. మిగిలిన 106 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కొనసాగింది. మహబూబాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని సమస్యాత్మకమైన 13 అసెంబ్లీ నియో జకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సా యంత్రం 4 గంటల వరకు కొనసాగింది. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములు గు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో పోలింగ్ పక్రియ ముగిసింది. ఉదయం మొదలయిన పోలింగ్ సాయంత్రం తెలంగాణ వ్యాప్తంగా పోలింగ్ పక్రియ ఊపందుకుంది. అన్ని నియోజకవర్గాల పరిధిలో ఓటర్లు ఉత్సాహంతో ఓటు వేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో 69.81 శాతం, భువనగిరిలో 72.34 శాతం, చేవెళ్లలో 53.15 శాతం, హైదరా బాద్‌లో 39.17 శాతం, కరీంనగర్‌లో 67.67 శాతం, ఖమ్మంలో 70.76 శాతం, మహబూబాబాద్‌లో 68.60 శాతం, మహబూబ్‌న గర్‌లో 68.40 శాతం, మల్కాజ్‌గిరిలో 46.27 శాతం, మెదక్‌లో 71.33 శాతం, నాగర్‌కర్నూల్‌లో 66.53 శాతం, నల్లగొండలో 70.36 శాతం, నిజామాబాద్‌లో 67.96 శాతం, పెద్దపల్లిలో 63.86 శాతం, సికింద్రాబాద్‌లో 42.48 శాతం, వరంగల్‌లో 64.08 శాతం, జహీరాబాద్‌లో 71.91 శాతం పోలింగ్ నమోదైంది.

# పోటెత్తిన ఓటర్లు





విజయవాడ మధ్య నియోజక వర్గంలోని రైల్వే ఫంక్షన్ హాల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



## ఓటు హక్కు వినియోగించుకున్న కేశినేని శివనాథ్ దంపతులు

విజయవాడ, మే 14 (ఆంధ్రపత్రిక) : టిడిపి విజయవాడ పార్లమెంట్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేసిన కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం ఆంధ్ర లయోల కాలేజీలో కేశినేని శివనాథ్ తన కటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. కేశినేని శివనాథ్ వెంట సతీమణి జానకి లక్ష్మీ, కుమారుడు వెంకట్, కూతురు స్నిగ్ధ, తల్లి ప్రసున్నాంబ వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌లో జరుగుతున్న ఎన్నికల సరళిని గమనించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ఎన్నికలు నిష్పాక్షపాతంగా జరిగేలా చూడాలని ఎన్నికల అధికారులను కోరారు.







ఒంగోలులోని రాంనగర్ 2వ లైన్ మున్సిపల్ హైస్కూల్‌లో తమ ఓటును వినియోగించుకున్న ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మరియు కుటుంబ సభ్యులు గీతాలత, మాగుంట నిఖిల్ రెడ్డి, మాగుంట సుబ్బరామ రెడ్డి



విజయవాడలో ఓటుహక్కు వినియోగించుకున్న సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి



విజయవాడ మధ్య నియోజకవర్గంలోని రైల్వే ఫంక్షన్ హాల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, పి.ప్రశాంతి దంపతులు



తన స్వగ్రామం సత్తెనపల్లి వచ్చి, ఓటు హక్కును వినియోగించుకున్న నెల్లూరు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ బత్తుల అఖిల



ఓటు హక్కు వినియోగించుకున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా.





పులివెందుల నియోజక వర్గం, వేంపల్లె మండలం ఇడుపులపాయ పోలింగ్ బూత్ 261లో చీఫ్ కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి, బ్రదర్ అనిల్ కుమార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు





Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh,
and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com